ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 30 అక్టోబరు 2025



నేడు కూడా విద్యా సంస్థలకు సెలవు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ కారణంగా జిల్లాలో బుధవారం సైతం వర్షాలు పడడంతో అన్ని విద్యా సంస్థలకు గురువారం కూడా సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంస్థల భవనాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వాసితులకు వసతి కల్పించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె వెల్లడించారు.




అనకాపల్లి మండలం వెంకుపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది


మునగపాక మండలం గణపర్తి వద్ద కుంగిన శారదా నది గట్టు


అనకాపల్లి మండలం తుమ్మపాలలో నీట మునిగిన వరి పొలాలు

ముంచిన మొంథా

తుఫాన్, భారీ వర్షాలతో జిల్లాలో పలు రంగాలపై ప్రభావం

- 1,277 హెక్టార్లలో నీట మునిగిన వరి
- అరటి, తమలపాకు తోటలు, కూరగాయ పంటలకూ నష్టం
- నేలకొరిగిన 84 విద్యుత్ స్తంభాలు
- తీవ్రంగా దెబ్బతిన్న రహదారులు
- జలాశయాలకు భారీగా వరద
- గేట్లు ఎత్తడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- 160 పూరిపాకలు, కచ్చా ఇళ్లు నేలమట్టం
- పునరావాస కేంద్రాలు నేడూ కొనసాగింపు

అనకాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాన్ మంగళవారం రాత్రి తీరం దాటి బలహీన పడినప్పటికీ జిల్లాలో బుధవారం సాయంత్రం వరకు ఈదురుగాలులు వీచాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం దంచికొట్టింది. తరువాత క్రమేపీ తగ్గుముఖం పట్టింది. తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వీచిన ఈదురు గాలుల కారణంగా జిల్లాలో పలు రంగాలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వ యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎక్కడా ప్రాణనష్టం సంభవించలేదు. తుఫాన్ కారణంగా రైతులు ఎక్కువ నష్టపోయారు. ప్రభుత్వ శాఖలకు వచ్చేసరికి విద్యుత్తు, నీటిపారుదల, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్ శాఖలకు ఎక్కువ వాటిల్లింది. రహదారులు ఛిద్రం అయ్యాయి. కాజ్‌వేలు, వంతెనలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడా పూరిపాకలు, పునాతన పెంకుటిళ్లు, మిద్దె ఇళ్లు కూలిపోయాయి. జిల్లాలో పంట, ఆస్తి నష్టం వివరాలను సేకరించిన అధికారులు ఎంత మేరకు నష్టం వాటిల్లింది, ఎంత నిధులు అవసరం అన్న దానిపై అంచనాలు రూపొందించి కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు.

మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి జిల్లాలో వర్షాలు మొదలయ్యాయి. క్రమేపీ పెరుగుతూ మంగళవారం రాత్రికి కుండపోతగా మారాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని పంటలు, నివాసాలు నీటమునిగాయి. ఇదే సమయంలో అన్ని జలాశయాల నుంచి పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేయడంతో నదుల్లో వరద ఉధృతి పెరిగింది. దీంతో పొలాల్లో నుంచి వాగుల ద్వారా నదుల్లో చేరాల్సిన నీరు చాలా చోట్ల వెనక్కు తన్ని, పంటలు ముంపునకు గురయ్యాయి. బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించిన వ్యవసాయ శాఖ అధికారులు అనకాపల్లి, కశింకోట, సబ్బవరం, దేవరాపల్లి, చీడికాడ, చోడవరం, నర్సీపట్నం, నాతవరం, ఎస్.రాయవరం, రాంబిల్లి, తదితర మండలాల్లో 1,277 హెక్టార్లలో వరి పంట నీటమునిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. అనకాపల్లి మండలంలో 483 హెక్టార్లు, కశింకోట మండలంలో 65 హెక్టార్లు, సబ్బవరంలో 21, దేవరాపల్లిలో 16.99, చీడికాడలో 8, చోడవరంలో 3.6, నర్సీపట్నంలో 7.2, నాతవరంలో 10, ఎస్.రాయవరంలో 20 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది.గురువారంనాటికి ముంపు మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. వరిపైరు గింజ కట్టే దశలో వర్షాలకు నీటి ముంపునకు గురవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైవాడ, పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ, తాండవ జలాశయాల్లోకి వరద పోటెత్తడంతో అధికారులు గేట్లు ఎత్తి వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శారదా, తాండవ, పెద్దేరు, బొడ్డేరు, వరహా, సర్పా నదులు పొంగి ప్రవహించి, లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలను ముంచెత్తాయి. ఈదురు గాలుల కారణంగా పాయకరావుపేట మండలంలో తమలపాకు, అరటి తోటలకు నష్టం వాటిల్లింది.


చోడవరం మండలం కన్నంపాలెం వద్ద నీటి ముంపులో చెరకు తోటలు

మొంథా తుఫాన్ కారణంగా ఈదురు గాలులు వీచడంతో ఈపీడీసీఎల్‌కు నష్టం జరిగింది. చెట్లు కూలడం, కొమ్మలు విరిగిపడడంతో 83 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 31 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. సమాచారం అందిన వెంటనే అధికారులు, సిబ్బంది వెంటనే వెళ్లి స్తంభాలను సరిచేసి, సరఫరాను పునరుద్ధరించారు. దీంతో విద్యుత్ సరఫరాకు పెద్దగా అంతరాయం ఏర్పడలేదు.

భారీ వర్షాలతో జిల్లాలో 160 నివాసాలకు నష్టం వాటిల్లింది. వీటిలో 49 తాటాకు ఇళ్లు, 111 కచ్చా ఇళ్లు వున్నాయి. ఎస్.రాయవరం మండలంలో రెండు, మాడుగుల మండలంలో ఒక ఆవు, దేవరాపల్లి మండలంలో రెండు ఎద్దులు చనిపోయాయి.

తుఫాన్, భారీ వర్షాల వల్ల జలవనరుల శాఖకు ఎక్కువ నష్టం వాటిల్లింది. కశింకోట మండలం తీడ గ్రామంలో శారదా నది వరద గట్టు దెబ్బతిన్నది. ఎస్.రాయవరం మండలం సోమదేవునిపల్లిలో వరహా నది కాలువకు గండి పడింది. మాడుగుల మండలం తాటిపర్తిలో ఎన్టీఆర్ రిజర్వాయర్ కల్వర్టు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. సబ్బవరం మండలం అంతకాపల్లిలో అప్పలరాజు చెరువు నిండిపోయి ఫీడర్ ఛానెల్ దెబ్బతిన్నది.

ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు..

అసలే అంతంతమాత్రంగా వున్న గ్రామీణ రహదారులు.. భారీ వర్షాలతో మరింత దారుణంగా తయ్యారయ్యాయి. అనకాపల్లి, చోడవరం, సబ్బవరం, బుచ్చెయ్యపేట, ఎలమంచిలి, పరవాడ, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో సుమారు 42 కిలోమీటర్ల పొడవుగల 14 తారు రోడ్లు బాగా దెబ్బతిన్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు. ఇంకా బుచ్చెయ్యపేట, కోటవురట్ల, గొలుగొండ, రోలుగుంట, నర్సీపట్నంలో ఒక్కోరోడ్డు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మునగపాక మండలం కొండకర్ల ఆవ నుంచి గణపర్తి వెళ్లే రోడ్డులో ఒక కల్వర్టు, చీడికాడ నుంచి జి.కొత్తపల్లి వెళ్లే రోడ్డులో ఒక కల్వర్టు ధ్వంసం అయ్యాయి. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద డైవర్షన్ రోడ్డు ... మిగతా 8వ పేజీలో

శారదా నది ఉగ్రరూపం

అనకాపల్లి పట్టణం వద్ద శారదా నదిలో వరద ఉధృతంగా పెరిగింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు వర్షాలు కురవడంతో పాటు ఎగువునఉన్న రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి భారీ మొత్తంలో వరద నీటిని విడుదల చేయడంతో శారదా నది పరవళ్లు తొక్కుతున్నది. మంగళవారంతో పోలిస్తే వరద ఉధృతి రెట్టింపు అయ్యింది. శారదా నది ఒడ్డున వున్న ఉమారామలింగేశ్వర ఆలయం, శ్రీరామనగర్‌కాలనీ, మూలపేట వద్ద పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశారు.

రాంబిల్లి మండలంలో మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతోపాటు రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేయడంతో శారదా నదిలో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతున్నది. కొత్తూరు వద్ద మేజర్ శారదా నది పాత వంతెన పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నది. నారాయణపురం వద్ద మైనర్ శారదా నది ఎలమంచిలి- గాజువాక రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నది. దీంతో పోలీసులు ఈ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

పునరావాస కేంద్రాలు కొనసాగింపు

తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో అధికారులు బుధవారం కూడా సహాయక చర్యలు కొనసాగించారు. తుఫాన్ తీరంపట్టి, వాయుగుండంగా బలహీనపడినప్పటికీ జిల్లాలో బుధవారం సాయంత్రం వరకు అడపాదడపా వర్షం కురిసింది. దీంతో 78 పునరావాస కేంద్రాల్లో 3,993 మందికి భోజనం, వసతి సదుపాయం కల్పించారు. గురువారం కూడా పునరావాస కేంద్రాలు కొనసాగుతాయని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి తుఫాన్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

వర్షాలు తగ్గే వరకు పునరావాస కేంద్రాలు

108 కేంద్రాల్లో 5 వేల మందికి ఆశ్రయం

- పంట నష్టం అంచనాలో అధికారులు
- కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడి
- చోడవరంలో ముంపు ప్రాంతాల్లో పర్యటన


బానయ్యకోనేరు ప్రాంత వాసులతో ముంపు సమస్య గురించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

చోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పూర్తిగా తగ్గే వరకు జిల్లాలో తుఫాన్ పునరావాస శిబిరాలు కొనసాగిస్తామని కలెక్టర్ విజయకృష్ణన్ ప్రకటించారు. పట్టణంలో భారీ వర్షాలతో ముంపునకు గురైన బాలాజీనగర్, బానయ్యకోనేరు తదితర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం ఆమె పర్యటించారు. దుడ్డువీధిలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో నిర్వాసితులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 108 పునరావాస కేంద్రాల్లో ఐదు వేల మందికి ఆశ్రయం కల్పించి వారికి భోజనం అందుజేస్తున్నట్టు చెప్పారు. వర్షాలు తగ్గి, నిర్వాసితుల ఇళ్లు, పరిసరాలను పూర్తిగా శుభ్రం చేయించి శానిటేషన్ కార్యక్రమాల అనంతరం వారిని ఇళ్లకు పంపిస్తామని స్పష్టం చేశారు. ఏజెన్సీలో భారీ వర్షాలు కురిసినందున మైదాన ప్రాంతంలో నదులు పొంగిపొరుతున్నాయని ఆమె చెప్పారు. వివిధ రకాల పంటకు వాటిల్లిన నష్టాలను అంచనా వేసే పనిలో ఉన్నామని తెలిపారు. అంతకుముందు చోడవరం పంచాయతీలో ముంపునకు కారణమవుతున్న ... మిగతా 8వ పేజీలో

సహాయ చర్యలు కొనసాగింపు

అనకాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరాన్ని తాకినప్పటికీ మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశాలు వున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో సహాయ, పునరావాస చర్యలు కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు గురువారం కూడా పనిచేస్తాయని పేర్కొన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు: 08924 222888, 08924 225999, 08924226599. కాగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణ చర్యలు చేపట్టేందుకు ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో అనకాపల్లి: 94906 10023, కశింకోట: 8333811271,: 83338 11272, నర్సీపట్నం: 9491030723 కంట్రోల్ రూమ్‌లను గురువారం కూడా కొనసాగిస్తున్నట్టు ఎస్ఈ ప్రసాద్ తెలిపారు.

మత్స్యకార కుటుంబాలకు ఉచిత రేషన్

అనకాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా వారం రోజులపాటు జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాతావరణ శాఖ సూచనల మేరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. దీంతో ప్రతి మత్స్యకార కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, నూనె, చక్కెర, బంగాళదుంపలను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా అధికారులు ఆయా మత్స్యకార కుటుంబాలకు రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖ నుంచి వివరాలు సేకరించి గురువారం నుంచి మత్స్యకార గ్రామాలకు రేషన్ పంపనున్నట్లు జిల్లా మత్స్య శాఖాధికారి విజయ తెలిపారు.

జలాశయాలకు వరద పోటు

రైవాడకు 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


రైవాడ గేట్ల నుంచి శారదా నదిలోకి విడుదలవుతున్న నీరు

- పెద్దేరుకు 1,570 క్యూసెక్కులు..
- గేట్లు ఎత్తి నదుల్లోకి నీరు విడుదల

ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కుండపోతగా వర్షాలు కురవడంతో జిల్లాలోని అన్ని జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో అన్ని రిజర్వాయర్ల గేట్లు ఎత్తి అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధానంగా రైవాడ జలాశయం నుంచి రికార్డుస్థాయిలో 12 వేల క్యూసెక్కుల నీటి బయటకు వదులుతున్నారు. దీంతో శారదా నది ఉధృతంగా ప్రవహిస్తున్నది.

దేవరాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గెడ్డలు, వాగులు పొంగి వరద పోటెత్తింది. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా బుధవారం ఉదయం పది వేలు క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా రెండు గేట్లు ఎత్తి 9,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తరువాత వరద ప్రవాహం 11,000 క్యూసెక్కులకు పెరగడంతో నాలుగు గేట్ల నుంచి 12 వేల క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడుదల చేస్తున్నట్టు డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. కాగా రైవాడ జలాశయాన్ని కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పరిశీలించారు. నీటి విడుదలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

పెద్దేరు నుంచి 1,750 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతోమండలంలోని పెద్దేరు జలాశయానికి వరద పోటెత్తింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా బుధవారం ఉదయం ఎనిమిది ... మిగతా 8వ పేజీలో

వరికి చీడపీడల బెడద

తుఫాన్ వర్షాలతో పొంచి ఉన్న తెగుళ్ల ముప్పు

- సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలి
- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు


ముంపు ప్రాంతాల్లో వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందం

అనకాపల్లి అగ్రికల్చర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణగా కురిసిన వర్షాలు, రోజుల తరబడి మబ్బు పట్టిన వాతావరణం కారణంగా వరి పంటకు చీడపీడల బెడద అధికం కావచ్చునని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పంటలపై తుఫాన్ ప్రభావాన్ని అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందాలు బుధవారం పలు గ్రామాల్లో పర్యటించారని చెప్పారు. తెలిపారు. పొలాల్లో నుంచి నీటిని త్వరగా బయటికి పంపగలిగితే వరి, చెరకు పంటల పరిస్థితి మెరుగు పడుతుందని అన్నారు. ఆర్‌జీఎల్ 1061, ఎంటీయూ1318, ఎంటీయూ 1262, బీపీటీ 5204 రకాలు పూత దశలో ఉంటే తాలు గింజలు ఏర్పడి రంగు మారవచ్చని, మానిపండు తెగులు, మామిడి తెగులు ఆశించవచ్చని చెప్పారు. స్వర్ణ సంపద, స్వర్ణ బీపీటీ 5204 వంటి రకాలను సాగు చేస్తున్న పొలాల్లో ... మిగతా 8వ పేజీలో

'ప్రభుత్వ ముందస్తు చర్యలతో తప్పిన ప్రమాదం'

ఎలమంచిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా చేపట్టిన చర్యల కారణంగా పెద్ద ప్రమాదం తప్పిందని లక్కవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొలుకులూరి విజయ్ బాబు అన్నారు. బుధవారం పులపర్తి, లక్కవరం గ్రామాల్లో ఆయన పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సముద్రపు నాచు పెంపకంపై డ్వాక్రా మహిళలకు శిక్షణ

అచ్యుతాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మత్స్యశాఖ సమన్వయంతో తంతడి శివారు వాడపాలెం డ్వాక్రా మహిళలకు సముద్రపు నాచు పెంపకంపై బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేరళకు చెందిన ప్రొఫెసర్లు బ్రహ్మచార్యులు, మోహన కృష్ణ, అమృత శిక్షణ ఇచ్చారు. వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాస రావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ, సర్పంచ్ చోడిపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

పుట్టీలు, వలలు కొట్టుకు పోయాయని వినతి

రాంబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో పెదకలవలాపల్లి, వై.లోవ పరిధిలోని శారదా నదిలో చేపలు పట్టుకొనే 23 పుట్టీలు, వలలు కొట్టుకు పోయాయని మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం మండల ప్రత్యేకాధికారి మనోహర్, తహశీల్దార్ శ్రీనివాసరావులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు చింతకాయల ఎర్రయ్య మాట్లాడుతూ రాంబిల్లి సమీపంలోని నేవీ పునరావాస కాలనీలో నివాసముంటున్న మత్స్యకారులు శారదా నదిలో పుట్టీల ద్వారా చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. తుఫాన్ వల్ల అవి కొట్టుకుపోవడంతో ఉపాధి కోల్పోయారని, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు సూరాడ వెంకన్న, సూరాడ నూకరాజు, బాధిత మత్స్యకారులు రమణ, మల్లికార్జున తదితర మత్స్యకారులు పాల్గొన్నారు.

'పశువులకు సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి'

అచ్యుతాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వల్ల పశువులకు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ గణేష్ అన్నారు. తంతడి, ఖాజీపాలెం, ఎంజేపురం, నునపర్తి, అందలాపల్లి, తోటా, రాజాన పాలెం, నడింపల్లి గ్రామల పాడి రైతులతో బుధవారం ఆయన మాట్లాడి పశు సంరక్షణపై పలు సూచనలు చేశారు.



మునగపాక మండలం చూచుకొండ- గణపర్తి బ్రిడ్జిపైకి చేరిన వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



రాంబిల్లి మండలం నారాయణపురం వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మైనర్ శారదా నది ఉధృతిని పరిశీలిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు



అచ్యుతాపురం మండలం పెదపాడు వద్ద రోలుగెడ్డ నీటి ప్రవాహం గురించి వివరాలు అడిగి తెలుసుకుంటున అధికారులు

తీరాల్లో తుఫాన్ అలజడి

- పూడిమడకలో మత్స్యకారులను భయపెట్టిన సముద్రం
- బలహీనంగా ఉన్న శారదా నది గట్లు
- అర్ధరాత్రి మునగపాక మండలంలో ఇసుక బస్తాలతో పటిష్టం చేసిన అధికారులు
- భయాందోళన చెందుతున్న సమీప గ్రామాల ప్రజలు
- వై.లోవలో ముందుకు వచ్చిన మైనర్ శారదా.. ముంపునకు గురైన పలు ఇళ్లు
- గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే సుందరపు, ప్రగడ

అచ్యుతాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా మూడు రోజులుగా జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్లనుంచి బయటకు రాలేకపోయాయరు. ముఖ్యంగా మంగళవారం రాత్రి వర్షం మత్స్యకారులను మరింత భయపెట్టింది. పూడిమడక సముద్రంలో అలల ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. భీకర గాలులతో పాటు అలలు బాగా ముందుకు దూసుకు వచ్చాయి. ఇది చూసిన మత్స్యకారులు హడలిపోయారు. పూడిమడక బస్టాండ్ వద్ద ఉన్న రక్షణ గోడను భారీ అలలు తాకాయి. సముద్రప నీరు ఫౌంటైన్‌లా ఎగసిపడి ఆంజనేయ స్వామి ఆలయం వద్దపడేవని మత్స్యకారులు తెలిపారు. భారీ గాలులకు కడపాలెంలో కొబ్బరి, తాటి చెట్లు విరిగిపోయాయి. అలాగే సముద్రపు అలలు తీరానికి రావడంతో పడవలు ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి కొట్టుకుపోయాయి. అయితే మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పడవలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు. ఇదిలావుంటే, అచ్యుతాపురం మండలంలో పలుగ్రామాల మీదుగా ప్రవహిస్తున్న రోలుగెడ్డకు వరద వచ్చే అవకాశం ఉందని జిల్లా అధికారుల నుంచి సమాచారం రావడంతో తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో చిన్నారావు, సీఐ నమ్మి గణేశ్ బుధవారం గెడ్డ ప్రవహించే ప్రాంతాలను పరిశీలించారు. గెడ్డలోనీటి ఉధృతి పెరిగితే ప్రజలు ఇబ్బందులు పడకుండా పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేటల్లో పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్టు సదరు అధికారులు తెలిపారు. తుఫాన్ వల్ల మండలంలో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. చాలాచోట్ల చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడిపోయాయి. వెదురువాడ, ఆవసోమవరం, పూడిమడక, ఉద్దపాలెంలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. వెంటనే వీటిని మార్చి విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చేశామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మేజర్, మైనర్ శారదా నదులు

రాంబిల్లి : తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున మండలంలోని ప్రధాన మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొత్తూరు వద్ద మేజర్ శారదా నది పాత వంతెనపై నుంచి ప్రవాహం ఉంది. నారాయణపురం వద్ద మైనర్ శారదా నది రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ ఆదేశాల మేరకు రాంబిల్లి సర్కిల్ సీఐ నర్సింగరావు ఆధ్వర్యంలో పోలీస్ బృందం నదిపై ఉన్న రోడ్డుకు ఇరువైపులా మార్గాన్ని మూసివేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రైవాడ జలాశయం నీరు విడుదల చేయడంతో మైనర్‌శారదా నదిలో నీటి ఉధృతి పెరిగింది. మేజర్, మైనర్ శారదా నదుల గట్లు బలహీనంగా ఉండడంతో అధికారులతో పాటు టీడీపీ రాంబిల్లి మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు పరిశీలించారు. నదుల గట్లను ఇసుకబస్తాలతో పటిష్టం చేశారు. రాంబిల్లి, లాలంకోడూరు, దిమిలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో

బాధితులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలావుంటే, వై.లోవలో మైనర్ శారదానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వరద నీరు గ్రామ సమీపానికి చొచ్చుకువచ్చింది. దీంతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలతో పాటు పలువురు ఇళ్లు, పశుల పాకలు నీటి ముంపునకు గురయ్యాయి. మురకాడ, మర్రిపాలెం కట్టుబోలు, అప్పారాయుడుపాలెం, వెల్చూరు, కృష్ణంపాలెం తదితర గ్రామాల్లోని రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పలు శాఖల అధికారులతో కలిసి కొత్తూరు, నారాయణపురం ప్రవహిస్తున్న మేజర్, మైనర్ శారదా నదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే, పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లను



ఎలమంచిలిలో చెరువును తలపిస్తున్న క్రీడామైదానం

అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహమూర్తి, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి, టీడీపీ రాంబిల్లి మండల అధ్యక్షుడు లాలం భరత్, మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన పార్టీ రాంబిల్లి మండల శాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, బద్ది మహేష్ తదితరులు పాల్గొన్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన కొత్తూరు, నారాయణపురం గ్రామాల పరిధిలోని ఉధృతంగా ప్రవహిస్తున్న మేజర్, మైనర్ శారదా నదలను పరిశీలించారు. దిమిలి, కట్టుబోలు, మురకాడ, రజాల, మర్రిపాలెం గ్రామాల్లోని బలహీనంగా ఉన్న నదుల గట్లును, వరిపంట పొలాలను, దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలు, రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దిమిలి హైస్కూల్ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గట్టుపై నిరంతర నిఘా పెట్టండి : ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక : తుఫాన్ తీవ్రత తగ్గినప్పటికీ ఎగువ నుంచి వచ్చే వరద నీటి ఉధృతి కారణంగా కోతకు గురయ్యే ప్రమాదం ఉన్నందున నిరంతర నిఘా పెట్టాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికార యంత్రాంగానికి ఆదేశించారు. మండలంలోని గణపర్తి, చూచుకొండ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. గణపర్తి బ్రిడ్జిపై నుంచి నీటి ఉధృతిని పరిశీలించారు. అనంతరం గతంలో పలుమార్లు గండి ఏర్పడిన శారదానది గట్టును ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఒక చోట స్వలంగా కోతకు గురవుతున్న గట్టును పరిశీలించి ఇసుక బస్తాలను సిద్ధం చేసి ఉంచాలన్నారు. అయితే బుధవారం రాత్రికి వరద ఉధృతి మరింత పెరడడంతో బలహీనంగా ఉన్నగట్టు వద్ద ఇసుక బస్తాలను వేశారు. అలాగే, చూచుకొండ- గణపర్తి బ్రిడ్జిని పరిశీలించారు. ఎగువ నుంచి నీరు అధికమైతే బ్రిడ్జిపై నుంచి ప్రవహించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట పలు శాఖలకు చెందిన అధికారులు, కూటమి నాయకులు కాండ్రేగుల నాయుడు, కె.రాజశేఖర్, ఎం.వి.రమణ, దొడ్డి శ్రీనువాసరావు, దాడి ముసిలినాయుడు, ఆడారి గణేశ్ తదితరులు ఉన్నారు.

పంట పొలాలను పరిశీలించి వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఇదిలావుంటే, నీట మునిగిన వరి పొలాలను, చెరకును వ్యవసాయాదికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. మునగపాక, వాడ్రాపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రెండు,మూడు రోజుల్లో నీరు తొలగిపోయే పొలాలు బాగుంటాయన్నారు. సాధ్యమైన మేరకు రైతులు పొలాల్లో నీటిని బయటకు పోయే మార్గాలు చూడాలన్నారు. శాస్త్రవేత్తలు రమణమూర్తి, పద్మావతి, రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న వరి పొలాలకు ఆకుముడత తెగులు అధికంగా సోకిందని చెప్పారు. మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ పంటనష్ట వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. వాడ్రాపల్లిలో జిల్లా తెలుగురైతు ప్రధాన కార్యదర్శి మళ్ల వరహానర్సింగరావు నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయ అధికారులకు చూపించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో ఈదురు గాలుల బీభత్సం

ఎలమంచిలి : తుఫాన్ తీరం దాటిన అనంతరం బుధవారం తెల్లవారు నుంచి వర్షం కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ ఎలమంచిలిలో ఈదురు గాలులు భీకరంగా వీచాయి. దీంతో పలుచోట చెట్లు నేలకూలాయి. సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పలు చోట్ల విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడడంతో వీటన్నింటిని క్లియర్ చేసేందుకు సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఇదిలావుంటే, రైవాడ జలాశయం నీరు విడుదల చేయడంతో ప్రధానంగా సోమలింగపాలెం గ్రామ సమీపంలో శారదా నది వరద ఉధృతి పెరిగింది. తహశీల్దార్ వరహాలు సందర్శించి అధికారులను, ఆయా ప్రాంతాల వారిని అప్రమత్తం చేశారు. టిడ్కో గృహ సముదాయం వద్ద హైవేపై పడిన చెట్లను మునిసిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌ల సహాయంతో తొలగించారు. అదే విధంగా పట్టణంలో పలు చోట్ల నేలకూలిన, ప్రమాద భరితంగా ఉన్న చెట్ల కొమ్మలను అగ్నిమాపక సిబ్బంది, మునిసిపల్ అధికారులు సమన్వయంతో తొలగించారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోకుండా యర్రవరం సమీపంలోని సెయింట్ జూడ్స్ స్కూల్ పరిసరాల్లో కాలువలను ఏర్పాటు చేశారు. మిలట్రీ కాలనీలో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజీవ్ గాంధీ క్రీడామైదానం చెరువును తలపించేలా వర్షపు నీరు చేరింది. రామారాయుడుపాలెం, జంపపాలెం, పులపర్తి, పరిసరాల్లో ఈదురు గాలుల కారణంగా వరి పంట నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముంపులోనే లక్ష్మీనగర్



లక్ష్మీనగర్‌లో చేరిన వరద నీరు

పాయకరావుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్ నీటి ముంపులో ఉంది. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీరు బయటకు వెళ్లే మార్గంలేక రెండు రోజులుగా నిలిచిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దోమల వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. గతంలో లక్ష్మీనగర్‌లో నీరు పోవడానికి కాలువను ఏర్పాటు చేశారు. కాలువ మధ్యలో మూసుకుపోవడంతో నీరు పారడం లేదని కాలనీ వాసులు వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాయితీ దాణాను వినియోగించుకోండి

- పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు శ్రీధర్



పెదరాంభద్రపురంలో పాడి రైతులకు దాణా అందిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పశుదాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు శ్రీధర్ కోరారు. పెదరాంభద్రపురం గ్రామంలో బుధవారం దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను నేపథ్యంలో మండలానికి ఏడు టన్నుల పశుదాణా వచ్చిందన్నారు. 50 కిలోల బస్తా రూ.1110 కాగా, 50 శాతం రాయితీపై రూ.555 సరఫరా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు గుప్త, శ్రీనివాస్, శరణ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సిహెచ్.ప్రదీప్, నాయకులు నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ఆహారం సరఫరా



తోకలవారి వీధిలో బాధితులకు ఆహారం అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోకలవారి వీధి, రజక కాలనీలలో తుఫాన్ బాధితులకు బుధవారం టీడీపీ నాయకులు ఆహారం అందించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు వరహాలు మాట్లాడుతూ మంత్రి అనిత ఆదేశాల మేరకు బాధితులకు భోజనాలు, టిఫిన్లు అందజేశామన్నారు. నాయకులు పి.శ్రీను, విలియం కేరీ, జి.నాగు, ఎం.నారాయణరావు, వి.అప్పారావు, జూరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

భారీ వర్షం.. అంతా జలమయం



కోటవురట్లలోని పాతరోడ్డు వద్ద ప్రవహిస్తున్న సర్పా నది

- పరవళ్లు తొక్కుతున్న నదులు, గెడ్డలు, వాగులు
- నేలకొరిగిన తమలపాకు తోటలు.. నీట మునిగిన పొలాలు
- కూలిపోయిన చెట్లు.. ధ్వంసమైన ఇళ్లు

మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కురిసిన వర్షాలకు నదులు, వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. చాలా చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వంతెనలు, కాజ్‌వేలపై నుంచి నీరు ఏరులా పారుతోంది.

పాయకరావుపేట/ పాయకరావుపేట రూరల్/ ఎస్.రాయవరం/ కోటవురట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పట్టణం, మండలంలో భారీ వర్షాలకు నదులు పొంగి ప్రవహించాయి. సత్యవరం, మాసాహెబ్‌పేట, కొత్తూరు, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, తదితర గ్రామాలలో తమలపాకు తోటలు నేలకొరిగాయి. ఉద్యానవన శాఖాధికారి సాయిప్రియ మండలంలో పర్యటించి నేలకొరిగిన తమలపాకు తోటలను పరిశీలించారు. సుమారు వంద ఎకరాలలో తోటలు పూర్తిగా దెబ్బతిన్నట్టు ఉద్యానవన శాఖాధికారి తెలిపారు. అలాగే పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఈదురుగాలులకు భారీ వృక్షం కూలింది. అయితే పాఠశాలలకు సెలవుల ఇవ్వడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రమాదం తప్పింది. బుధవారం ఎస్.ఐ పురుషోత్తం, పీఆర్ ఏఈఈఈ కచేరి, డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్, ఎంఈవో రమేశ్ పాఠశాలను పరిశీలించారు. అరట్లకోట, మంగవరం, సత్యవరం, మాసాహెబ్‌పేట తదితర గ్రామాలకు ఆనుకుని తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. సత్యవరం వద్ద బ్రిడ్జిని ఆనుకుని నీరు పారుతోంది. దీంతో మాసాహెబ్‌పేట, సత్యవరం తదితర గ్రామాలకు



పాయకరావుపేట సత్యవరం బ్రిడ్జి వద్ద ఉధృతంగా పారుతున్న తాండవ నది

చెందిన రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

కోటవురట్ల మండలంలో ఎడితెరిపిలేకుండా కురిసిన వర్షాలనికి నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. వరహా, సర్పానదులు గట్లకు అనుకొని ఉరకలేస్తున్నాయి. దుగ్గాడ, తాండవ రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తివేశారు. మండలంలో సుంకపూర్, తంగేడు పెద్ద చెరువులు పూర్తిగా నిండిపోయాయి. మొక్కజొన్న, పత్తి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షం వల్ల నష్టం వాటిల్లిడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బీకేపల్లి, లింగాపురం, తిమ్మాపురం కెవెంకటాపురం, పీకేపల్లి గ్రామాల్లో పత్తిపంట పొలాల్లోనే తడిసి ముద్దయింది. బోడ్డేపల్లి ఎస్సీ కాలనీ. పీకేపల్లి, పాములవాకలో, అన్నవరం, యండపల్లి, తంగేడు, రామన్నపాలెం గ్రామాల్లో మొత్తం తొమ్మిది ఇళ్లు కూలిపోయాయని తహశీల్దార్ తిరుమలబాబు తెలిపారు. అలాగే ఎస్.రాయవరం మండలంలో తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరగడంతో దార్లపూడిలో వరహానది చెక్ డ్యామ్ వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరహానదిలో వరద నీరు పరుగులు తీస్తున్నది. వరహానది రహదారితో పాటు నది గట్టు కోతకు గురవడంతో పాత సోముదేవపల్లి గ్రామానికి రాకపోకలు చేయడానికి తాత్కాలికంగా గ్రావెల్‌తో ఏర్పాటు చేసుకున్న మార్గం దెబ్బతింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే పాత సోముదేవుపల్లికి రహదారి కోతకు గురైంది.



సత్యవరంలో నేలకొరిగిన తమలపాకు తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి సాయిప్రియ



పాయకరావుపేట జడ్పీ పాఠశాలలో కూలిన చెట్టును పరిశీలిస్తున్న అధికారులు



కోటవురట్ల మండలంలోని నీలిగుంటలో నీట మునిగిన పత్తి పంట



ఎస్.రాయవరం: కోతకు గురైన పాత సోముదేవుపల్లి రహదారి

370 ఎకరాల్లో మునిగిన వరి పొలాలు

- మండల వ్యవసాయ శాఖాధికారిణి సౌజన్య

ఎస్.రాయవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో సుమారు 370 ఎకరాల వరి పంట నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా వేశామని మండల వ్యవసాయ శాఖాధికారిణి సౌజన్య తెలిపారు. వరి పొలాలు నీట మునిగిన గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారదనదికి చెందిన వరద నీరు సర్వసిద్ధి, సైతారుపేట, జేవీ పాలెం గ్రామాల్లో వరి పొలాలను ముంచెత్తడంతో పంట నీట మునిగిందన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్టు తెలిపారు. అయితే ఎక్కువ శాతం వరి పంట పిలకలు పెట్టే దశలో ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చీడపీడల నివారణకు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలను అందించినట్టు చెప్పారు.



సర్వసిద్ధిలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో సౌజన్య

వ్యవసాయ సిబ్బంది దినకర్, బ్లెస్సీ, సంతోషి, రకాష్ తదితరలు పాల్గొన్నారు.

స్వాములకు అన్నప్రసాదం

ఎస్.రాయవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ తిమ్మాపురంలో అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రతీ ఏటా నిర్వహిస్తున్నారు. బుధవారంతో అన్న ప్రసాదానికి పదేళ్ల పూర్తయినట్టు అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో సభ్యుడు గురుస్వామి, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ తదితరులు తెలిపారు. గ్రామ పెద్దలు, వర్తకులు, భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతున్నదని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా మాలధారణ చేసిన సుమారు 300 మంది స్వాములకు ఉచితంగా అన్నప్రసాదం (భిక్ష) ఏర్పాటు చేస్తుండడం ఎంతో వడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. దీంతో సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


తోటాడకు వెళ్లే జంక్షన్ సమీపంలో నేలకూలిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం


కశింకోట మండలం ఏనుగుతునిలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద


సబ్బవరం మండలం ఆరిపాక- టెక్కలిపాలెం రహదారిలో కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల


పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పునరావాస కేంద్రంలో మత్స్యకారులకు భోజనం ఏర్పాట్లు

మూడు రోజులు వణికించిన 'మొంథా'

- వర్షాలతో స్తంభించిన జనజీవనం
- గాలులకు పలుచోట్ల నేలకొరిగిన చెట్లు
- యుద్ధ ప్రాతిపదికన తొలగించిన వివిధ శాఖల సిబ్బంది
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పునరావాస కేంద్రాల్లో విస్తృతంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- శారదా నది ఉధృతితో పరీవాహక ప్రాంతాల్లో పర్యటించిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు


శారదా నది గట్టుకు ఆనుకుని ఉన్న కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్డీసీ సుబ్బలక్ష్మి, చిత్రంలో డీఎస్పీ శ్రావణి, జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ మూడు రోజులుగా వణికిస్తూనే ఉంది. అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో బుధవారం మధ్యాహ్నం వరకు అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రధానంగా అనకాపల్లి పట్టణంలో ఈ ప్రభావం అధికంగా ఉంది. వేకువజామున వీచిన గాలులకు జాతీయ రహదారిలోని తోటాడకు వెళ్లే జంక్షన్ సమీపంలో భారీ వృక్షం జాతీయ రహదారిపై పడిపోయింది. ఆనందపురం మార్గం నుంచి కశింకోట వైపు వెళ్లే మార్గంలో ఈ చెట్టు నేలకొరగడంతో పోలీసు, ఎన్‌డీఆర్ఎఫ్, విద్యుత్‌శాఖ, జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి యంత్రాలతో చెట్టును తొలగించారు. కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయినప్పటికీ వాహనాలను జలగలమదుం జంక్షన్ నుంచి అనకాపల్లి వైపు మీదుగా ట్రాఫిక్ పోలీసులు మళ్లించారు. రెండు గంటల పాటు శ్రమించి చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అలాగే మహిళా పోలీసు స్టేషన్ ఆవరణలో చెట్టు నేలకొరగడంతో అగ్నిమాపకశాఖ అధికారులు ఎలక్ట్రికల్ కట్టర్లతో వచ్చి తొలగించారు. పలు రహదారుల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేటు ఆవరణలో కూడా నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు గట్టుపై నుంచి కాంప్లెక్స్‌లోకి వెళ్లాల్సి వచ్చింది. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తోటి అధికారులతో కలిసి పట్టణంలో విస్తృతంగా పర్యటించి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తగు చర్యలు తీసుకున్నారు.

శారదా గట్టుకు ఆనుకున్న ఉన్న కాలనీలవాసులు పునరావాసాలకు తరలి రావాలి : ఎస్డీసీ

రైవాడ జలాశయం నుంచి నీటిని విడుదల చేయడంతో పాటు శారదా నది ఉధృతంగా ప్రవహిస్తుండడాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, డీఎస్పీ ఎం.శ్రావణి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, తహశీల్దార్ శాంతిభూషణరావు, గట్టు పైనుంచి బుధవారం పరిశీలించారు. గట్టు బలహీనంగా ఉండే పరిస్థితి నెలకొనడంతో గట్టుకు ఆనుకొని నివాసాలుంటున్న కాలనీవాసులను అప్రమత్తం చేశారు. మరో రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి కాలనీవాసులకు సూచించారు. రైవాడ నీటి ప్రవాహం శారదానదిలో గంట గంటకు పెరుగుతున్నందున ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండాలంటే పునరావాసాలకు వస్తే అధికారులు సౌకర్యాలు ఏర్పాటు చేస్తారన్నారు. డీఎస్పీ శ్రావణి కూడా ఇదే అంశాన్ని వివరించారు. జీవీఎంసీ అధికారులు వరప్రసాద్, కె.రమణ, ఎస్.శేఖర్, సీఐలు జి.ప్రేమ్‌కుమార్, ఎం. వెంకటనారాయణ, కూటమి నాయకులు ఆళ్ల రామచంద్రరావు, అప్పికొండ గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత సాయంత్రం కాలనీని సందర్శించి, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైసీపీ నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్ తదితరులు ఆమె వెంట ఉన్నారు. ఇదిలావుంటే, శారదానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బుధవారం రాత్రి బీజేపీ నాయకులు శారదానది ఒడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పలకా రవి, కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు ప్రాణహానికి గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని సీఐ ప్రేమ్‌కుమార్‌ను కోరారు.

కాంప్లెక్స్‌లో నీరు బయటకు పోయేలా చర్యలు

పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిపోతున్న నీటిని ప్రహరీ గోడ అవతల ఉన్న కాలువలోకి తాత్కాలికంగా మళ్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ముందుగా కాలువలోకి నీరు పోవడానికి అడ్డంకిగా ఉన్న పూడికను కార్మికులతో తొలగింపు చేస్తున్నారు.

నది వద్ద పలు చోట్ల పోలీసు పికెట్లు

శారదా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నది ఒడ్డున గల ఉమా రామలింగేశ్వర ఆలయం వద్ద, శ్రీరామనగర్ కాలనీ వద్ద, మూలపేట వద్ద బుధవారం పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశారు. నదికి ఆనుకొని ఉన్న ప్రజలెవరూ ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.



అనకాపల్లిలో పాత వంతెన పైనుంచి శారదా నది ప్రవాహాన్ని తిలకిస్తున్న జనం.., శివాలయం ఒడ్డు మెట్లను తాకుతున్న వరదనీరు

వెంకుపాలెం వద్ద ఉధృతంగా 'శారదా' ప్రవాహం

కొత్తూరు: తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి శారదా నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం రైవాడ గేట్లు ఎత్తివేయడంతో నీటిమట్టం మరింత పెరగడంతో వెంకుపాలెం వద్ద మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది. నదికి ఒడ్డున ఉన్న శివాలయం మెట్లు పూర్తిగా మునిగిపోయాయి. వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో ముందుగానే అధికార యంత్రాంగం ప్రజలను, రైతులను అప్రమత్తం చేసింది. వెంకుపాలెం వెదుళ్ళ గెడ్డ నుంచి మరింత ఉధృతంగా వరద నీరు ప్రవహించి పంట పొలాలను, సుందరయ్యపేట, వెంకుపాలెం వెళ్ళే రహదారిని పూర్తిగా ముంచివేసి నదిని తలపించేలాప్రవహిస్తోంది. సమీప ప్రజలు అటువైపు వెళ్ళకుండా అనకాపల్లి రూరల్ పోలీసు సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

తుమ్మపాల : తుఫాన్ కారణంగా తుమ్మపాల మెయిన్ రోడ్డు, దిబ్బపాలెం రోడ్డు, మార్టూరు జంక్షన్ తదితర ప్రాంతాలు వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడురోడ్లు ఎక్కడికక్కడ గోతులు పడడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. తుమ్మపాలలో పొలాలు పూర్తిగా నీట మునిగాయి. దాదాపు 300 నుంచి 400 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వెదురుపర్తి వద్ద ఉరకలేస్తున్న నది

కశింకోట : తుఫాన్ కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో పాటు రైవాడ జలాశయం గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేయడంతో వెదురుపర్తి వద్ద శారదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రత్తం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా వెదురుపర్తి శారదా నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పాడి పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అంతేగాకుండా పూరిగుడెసెల్లో ఉన్న వారిని జోగారావుపేట పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉంచారు. వీరికి అవసరమైన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారు.

కొత్తూరు, తాళ్లపాలెంలలో డీపీవో సందీప్ పర్యటన

కొత్తూరు/కశింకోట, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరు ఎన్జీవోస్ కాలనీలో జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ బుధవారం పర్యటించారు. ముంపునకు గురైన కాలనీలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, కార్యదర్శి సుభాష్, గ్రామ పెద్దలు ఉన్నారు. అలాగే, కశింకోట మండలంలోని మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో డీపీవో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాయల మురళీ, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యారావు తదితరులున్నారు. ఇదిలావుంటే, అనకాపల్లి మండలం వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి తదితర గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ బుధవారం పర్యటించారు. తుఫాన్ కారణంగా ముంపునకు గురైన వెంకుపాలెం- సుందరయ్యపేట, కుంచంగి, వెంకుపాలెం రహదారుల్లో వెదుళ్ళగెడ్డను, నీటమునిగిన వరి పంట పొలాలను పరిశీలించారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కశింకోట మండలం ఏనుగుతుని గ్రామంలో పర్యటించారు. ఆయన వెంట పలువురు రైతులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటాం : పీలా

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం ఆదుకుంటుందని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన ఏనుగుతుని, గొబ్బూరు, జోగారావుపేట, పేరంటాలపాలెం గ్రామాల్లో నీటమునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో తుఫాన్ వల్ల కలిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ముందుగా ఏనుగుతుని గ్రామంలో పర్యటించి నష్టపోయిన పంటలను నమోదు చేయాలని రెవెన్యూ, వ్యవసాయాధికారులకు సూచించారు. గొబ్బూరులో కొండచరియలు విరగడంతో దెబ్బతిన్న ఇంటిని పరిశీలించి వారికి వెంటనే నిత్యావసర వస్తువులు ఇవ్వాలని తహశీల్దార్ తిరుమలరావుకు సూచించారు. అనంతరం జోగారావుపేటలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడ కల్పిస్తున్న వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, నాయకులు ఉగ్గిన రమణమూర్తి, మజ్జి నిరంజన్‌కుమార్, వేగి గోపీకృష్ణ, కలగ సోమేశ్వరరావు, గొంతిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలపై తుఫాన్ ప్రభావం

పరవాడ : తుఫాన్ ప్రభావం మండలంలోని అన్ని గ్రామాలపై కనిపించింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. ఈ కారణంగా ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో యాభైకి పైగా పూరిగుడిసెలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నాయుడుపాలెం పంచాయతీ పరిధి రాముడుగారి దొడ్డి సమీపంలో పశువుల పాక కూలిపోవడంతో ఆవుపెయ్యి మృతిచెందగా, రెండు మేకలకు గాయాలయ్యాయి. రావాడ పంచాయతీ పరిధి సోమునాయుడుపాలెంలో కమ్మలపాక కూలిపోయింది. అలాగే ఇదే పంచాయతీ పరిధిలో శృంగారపాడు గ్రామంలో విద్యుత్‌వైర్లపై చెట్లు పడిపోవడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. ధర్మారాయుడుపేట జంక్షన్‌లో స్తంభం కూలిపోవడంతో అధికారులు వెంటనే స్పందించారు. ఈ పంచాయతీలో సుమారు 15 స్తంభాలకు పైగా ఒరిగిపోయాయి. అలాగే ముత్యాలమ్మపాలెంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రంలో వసతులను కొనసాగిస్తున్నారు. తహశీల్దార్ బి.నాగరాజు దగ్గరుండి సౌకర్యాలను పర్యవేక్షించారు. కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరం సమీపంలో గల సరుగుడు తోటలోంచి వర్షపునీరు ఉధృతంగా పారుతుంది.

లంకెలపాలెం : మొంథా తుఫాన్ కారణంగా మూడో రోజు బుధవారం లంకెలపాలెం, పరిసర ప్రాంత గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా సాలాపువానిపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, మంత్రిపాలెం, మడకపాలెం, గండివానిపాలెం, పచ్చిగోరువానిపాలెం, విజయరాంపురం పరిసర ప్రాంత గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా జాతీయ రహదారి తాడి మూడు మదాల వద్ద వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో రాకపోకలు బంద్ అయ్యాయి. లంకెలపాలెం, ఫార్మాసిటీ రహదారి ఏలేరు కాలువ బ్రిడ్జి వద్ద రహదారిపై నుంచి నీరు పారింది. తుఫాన్ కారణంగా వాహనాలను ఎక్కడక్కడే నిలిపి వేశారు.

గ్రామాల్లో పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే 'పంచకర్ల'

సబ్బవరం : తుఫాన్ పట్ల మరో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని అసకపల్లి, గుల్లేపల్లి, ఆదిరెడ్డిపాలెం, పినగాడి జంక్షన్, ఆరిపాక, టెక్కలిపాలెం గ్రామాల్లో పర్యటించారు. కాజ్‌వేల పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిని, రోడ్లపై పారుతున్న వరద నీటిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సాగు నీటి చెరువులు, వరి పంటల పరిస్థితిపై ఆరా తీశారు. రాయపురఅగ్రహారం, గొర్లివానిపాలెం, సబ్బవరం, మలునాయుడుపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లను తెలుసుకున్నారు. తుఫాన్ వల్ల జరిగిన నష్టం వివరాలు అంచనా వేసి వెంటనే నివేదిక అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పిద్మజ, ఏవో పోతల సత్యనారాయణ, ఇతర అధికారులు, నాయకులు ఇందలి రమణ, కొటాన అప్పారావు, బీప రావు, కర్రి కనకరాజు, రోమాల చంద్రశేఖర్, సింగంపల్లి శ్రీను, గొర్లి కుమార్, పద్మ, కేవీ సత్యనారాయణ, మేడిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షపు నీరు

వరద నీటిని పరిశీలించిన కలెక్టర్


చిన్నయ్యపాలెం రింగురోడ్డు నిర్మాణం వద్ద నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్

సబ్బవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. బుధవారం ఆమె మండలంలోని గుల్లేపల్లి రోడ్డులో గల కాజ్‌వే, విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే రింగు రోడ్డు వద్ద చేరిన వరద నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారిపై వరద నీరు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి నిర్మాణ సంస్థ అధికారులకు సూచించారు. గుల్లేపల్లి రోడ్డులో గల కాజ్‌వేను పరిశీలించి కాజ్‌వేపై వరద నీరు చేరకుండా, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. అనంతరం తుఫాన్ సందర్భంగా తీసుకున్న ఏర్పాట్లను తహశీల్దార్, ఎంపీడీవో లను అడిగి తెలుసుకున్నారు.

'గోహత్య నిషేధ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ ప్రతినిధి కేశవరాజు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గోహత్య నిషేధ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి ఆకారపు కేశవరాజు డిమాండ్ చేశారు. భోగలింగేశ్వరస్వామి ఆలయంలో పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అన్ని రాష్ట్రాల్లో గోవులను రక్షించుకునే చట్టాలను అమలు చేయాలన్నారు. గోవు మూత్రంతో మెడిసిన్ తయారవుతుందని చెప్పారు. గోవులను విస్మరించడం మంచిదికాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు డాక్టర్ డీడీ నాయుడు, శ్రీకాళహస్తి, చలపతిరావు, సుబ్బారాయుడు, భోగలింగేశ్వర ఆలయ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్య నారాయణ, సిద్ధిలింగేశ్వర ఆలయ మాజీ చైర్మన్ అమరపల్లి కృష్ణాజీ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రం అందజేత


చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

లంకెలపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గంజిపేటకు చెందిన గుర్రం చంద్రశేఖర్ ప్రమాదానికి గురికావడంతో కాలికి తీవ్ర గాయమైంది. అతని కాలి ఆపరేషన్ నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి పత్రాన్ని బుధవారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎర్రా కోటేశ్వరరావు, రౌతు మూర్తి, బొండా రమణ, దాసరి రామారావు, గుర్రం నాయుడు, రాజు, అర్జున్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యల్లారమ్మ కాలనీలో విరిగిపడిన కొండచరియలు

- రేకుల షెడ్డు, ద్విచక్ర వాహనం ధ్వంసం


కొండ చరియలు విరిగిపడటంతో ధ్వంసమైన బైక్

అనకాపల్లి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గొలగాం పంచాయతీ శివారు యల్లారమ్మ కాలనీలో బుధవారం కొండచరియలు విరిగి పడ్డాయి. గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు నివసిస్తున్న రేకుల షెడ్డుపై పడడంతో దెబ్బతిన్నాయి. అలాగే ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. స్థానిక టీడీపీ నాయకుడు తలారి కాశీనాయుడు ఇరవై కేజీల బియ్యం, నిత్యావసర సరకులను ఒక్కొక్క కుటుంబానికి అందజేశారు. అలాగే రెవెన్యూ అధికారులకు విషయాన్ని ఆయన తెలియజేశారు. జరిగిన ఆస్తినష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యాయత్నం చేసినట్టు పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక గాంధీనగరంలో నివాసముంటున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని(22) బుధవారం శారదానదిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. శారదానది ఉధృతిని పరిశీలించేందుకు వచ్చిన స్థానికులు ఆమె కూడా పరిశీలించేందుకు వచ్చినట్టు భావించారు. అయితే అకస్మాత్తుగా ఆమె నదిలోకి దూకడానికి ప్రయత్నం చేయడంతో స్థానికులు అప్రమత్తమై ఆమెను నిలువరించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమెను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అప్పటికే ఆమె ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతుండడంతో కుటుంబసభ్యుల సహకారంతో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని సీఐ తెలిపారు.


విశాఖ- అరకు మార్గంలో సుంకరమెట్టవద్ద రహదారిపై ప్రవహిస్తున్న నీరు


అనంతగిరి మండలం ఎగువశోభ గ్రామంలో నీటమునిగిన పంటపొలాలు

ముంచేసిన మొంథా

- అనంతగిరిపై తీవ్ర ప్రభావం
- కొట్టుకుపోయిన తాటిగుడ వద్ద కల్వర్టు
- డముకు-నిమ్మలపాడు రోడ్డులో జారిపడిన బండరాళ్లు

అనంతగిరి, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ మండలంపై అధిక ప్రభావం చూపింది. పంటపొలాలు నీటమునిగాయి. పలు గ్రామాల్లో ఇళ్లు నేటమట్టమయ్యాయి. చంపావతి, గోస్తనీ, శారద నదులు ఉగ్రరూపం దాల్చాయి. పలు గ్రామాలకు ఆనుకుని ఉన్న గెడ్డలు, వాగులు ఉధృతం ప్రవహిస్తుండంతో గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. డముకు-నిమ్మలపాడు రోడ్డులోని డముకు సమీపాన గెడ్డ ఉధృత్తికి కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహించడంతో పెదబిడ్డ, గుమ్మ, లంగుపర్తి, నిమ్మలపాడు పంచాయతీలోని పలు గ్రామాలకు సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. భీంపోలు పంచాయతీ లువ్వా సమీపంలోని కాజ్‌వేపై నుంచి వరదనీరు భయోందోళన కలిగిస్తోంది. దీనిపైనుంచి రాకపోకలు నిలిపివేశారు. గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీల్లో గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. తాటిగుడ జలపాతం వెళ్లేమార్గమధ్యలోని వంతెన నిర్మాణ పైపులు కొట్టుకుపోయాయి. మాలింగవలస-పాతకోట రోడ్డులోని మాలింగవలస సమీపంలోని గెడ్డ ఉధృతికి పాతకోట, రేగం, తేనెపుట్టు, తలారీపాడు, నందిగుమ్మి గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. అదే రోడ్డులో డేగలబంధ కల్వర్టుపైనుంచి వరద నీరు ఉధృతంగా పారుతోంది. డముకు-నిమ్మలపాడు రోడ్డు పులుసుమామిడి సమీపంలోని బండరాళ్లు రోడ్డుపై జారిపడ్డాయి. దమోదర్ అనే గిరిజనుడి సమాచారంపై అధికారులు స్పందించి బండరాళ్లను రోడ్డుపక్కకు తొలగించారు.

40 ఎకరాల్లో పంటకు ముప్పు

అనంతగిరి, రాజుపాక, బందకొండ, పాటిపల్లి, పెదకోట, రేగుళ్లపాలెం, కొండిభ, లైడ, పెదబిడ్డ, నిమ్మలపాడు, తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. వరి చివరి దశలో ఉండడం వరికి పెద్దగా ముప్పులేదని, వ్యవసాయశాఖ అధికారి రంగారావు వివరించారు.

47 ఇళ్లు నేలమట్టం

మండలంలోని 24 పంచాయతీలోని సుమారు 47 ఇళ్లు నేలకూలడంతో గిరిజనులు నిరాశ్రయులయ్యారు. ఒక పశువులు పాక కూలింది. గుమ్మకోట పంచాయతీలోని శంకుపర్తి గ్రామంలోని రెండు మేకలు, ఎగువశోభ గ్రామంలోన ఒక ఆవు మృతిచెందింది. మండలంలోని కోనాపురం, బొర్రా పంచాయతీ వంట్లమామిడి, చప్పాడి నుంచి బొ ర్రా గిరిజన సంక్షేమ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి 111 మందికి తరలించారు. కొత్తూరు గ్రామస్థులను 33 మందిని రైతు భరోసా కేంద్రంలో పునరావాసం కల్పించారు.పెదరాభగ్రామస్థులు, కరకవలసలో ముగ్గురిని ఆయా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రంలోని ఉంచారు. పెదబిడ్డ పంచాయతీ ధనకోట గ్రామస్థులను 141 మందికి గ్రామంలోని చర్చిలో పునరావాసం కల్పించారు. ఈ కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి, ఏపీసీ స్వామినాయుడు సందర్శించి, సౌకర్యాలపై గిరిజనులను అడిగితెలుసుకుంటున్నారు. తహశీల్దార్ వీరభద్రచారి, ఎంపీడీవో ప్రభాకర్, ఎస్ఐ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొర్రాలో ఇళ్లను పరిశీలించిన ఏపీసీ

అనంతగిరి: మండలంలోని బొర్రా హోటల్స్ వద్ద గోస్తనీ నదిని అనుకుని ప్రవహానికి గంగాధరరావుకు చెందిన ఇంటి గది పూర్తిగా కూలిపోగా, రాంబాబుకు చెందిన ఇంటికిందభాగం భారీగా కోతకు గురైంది. వీటిని మండల ప్రత్యేకాధికారి, ఏపీసీ స్వామినాయుడు, తహసీల్దార్ వీరభద్రచారితో కలిసి పరిశీలించారు. గోస్తనీ ప్రవాహానికి బీసాయిగుడ గ్రామానికి వెళ్లే రోడ్డు ఆనుకుని భారీగా కోతకు గురికావడంతో సుమారు 20 కుటుంబాలకు గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అదే గ్రామంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు ఈ మార్గంలో సుమారు 60 మంది పిల్లలు వెళ్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని గిరిజనులు, సర్పంచ్ అప్పారావు కోరుతున్నారు. అనంతగిరి పంచాయతీ మాలింగవలస-పాతకోట రోడ్డులోని గెడ్డను బుధవారం జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, తహసీల్దార్ వీరభద్రచారితో కలిసి వెళ్లి పరిశీలించారు.

అరకు ఘాట్‌రోడ్డులో వరదనీరు మళ్లింపు

అరకులోయ: జలదిగ్బంధంలో ఉన్న ఘాట్‌రోడ్‌లో వరదనీటిని ఎస్పీ అమిత్‌బర్ధర్ ప్రత్యేక చొరవతీసుకుని కిందికి మళ్లించారు. ఎస్పీ, పాడేరు డీఎస్పీ షెక్ షెహబాజ్ అహ్మద్, బీసుపురం, సుంకరమెట్టలోని ఘాట్‌రోడ్డును పరిశీలించారు. వరదనీరు మళ్లింపునకు సీఐ హిమగిరి, ఎస్ఐలకు పలు సూచనలు చేశారు. దీంతో నీటి మళ్లింపును యద్ధప్రాతిపదికన చేపట్టారు. విశాఖ,విజయనగరం ప్రాంతం నుంచి వాహనాలు ఘాట్ రోడ్డుపై రెండ్రోజులు వాహనాలు నిలిచిపోయాయి. వర్షం తగ్గుముఖం పట్టేవరకు వాహనాలను అనుమతించమని డీఎస్పీ షెహబాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరకు ఎస్ఐ, అనంతగిరి ఎస్ఐ గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు సుంకరమెట్ట, అనంతగిరి మండలంలో బీసుపురం సమీపంలో వరదనీరు ప్రవహిస్తుంది. జాతీయరహదారి, ఆర్అండ్‌బీ అధికారులు రోడ్లపై నీటి నిల్వలు లేకండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

నేలమట్టమైన ఇరగాయిలో శిథిల పాఠశాల భవనం

అరకులోయ: మండలంలోని మారుమూల ఇరగాయిలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం నేలమట్టమైంది. ఈ భవనం శిథిలం కావడంతో విద్యార్థులకు వేరేచోట్ల తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పాఠశాలకు భవన నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

కొయ్యూరు మండలంలో..

కొయ్యూరు: తుపాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం నుంచి మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. బుధవారం ఉదయం గాలులు తగ్గినప్పటికీ వర్షం కొనసాగుతుండటంతో జనజీవనం స్తంభించింది. బూదరాళ్ళ, మఠం భీమవరం, యు. చీడిపాలెం పంచాయతీల పరిధిలోని కొండలపై గ్రామాలలో ఇళ్లనుంచి బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి ఈదురు గాలులకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వర్షానికి చింతామ్మ ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉండటంతో ముందు జాగ్రత్తగా కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కిశోర్‌వర్మ ఆధ్వర్యంలో ఘాట్ ముందు రావణాపల్లి, చింతలపూడి గ్రామాల వద్ద రాకపోకలు నియంత్రించారు. కొయ్యూరు- చింతవానిపాలె ం గ్రామాల మధ్య బాలరేవులకు వెళ్లే హదారికి అడ్డుగా భారీ వృక్షం నేలకూలింది. పోలీసులువెళ్లి చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. డౌనూరు సమీపతులబాడ వద్ద కొండవాగు ప్రవాహం చింతపల్లి వెళ్లే రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలను నియంత్రించారు. రావణాపల్లి పంచాయతీ రేవడివీధిలో మంగళవారం అర్ధరాత్రి మాదల గంగరాజుకుచెందిన పూరిల్లు కుప్పకూలింది. యు. చీడిపాలెం పంచాయతీ పరిధి వేట్లపాలెం, గొట్లపాడు వద్ద బండి గెడ్డ పొంగడంతో వాగు అవతల సుమారు 20 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. మంప ఎస్ఐ శంకరరావుతో కూడిన బృందం వెళ్లి ప్రజలు వాగు దాటకుండా పహారా నిర్వహిస్తున్నారు. శరభన్నపాలెం వద్ద కొండవాగు ప్రవహిస్తోంది. రత్నంపేట- పాడి మధ్య కొండవాగుపై నిర్మించిన వంతెన పూర్తిస్థాయిలో కొట్టుకు పోయింది. మండల వ్యాప్తం చిన్నపాటి సంఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదని తహసీల్దారు ప్రసాద్, డీటీ కుమారస్వామి తెలిపారు.


గిరిజన గ్రామాల్లో నష్టంపై అంచనా వేస్తున్న పాడేరు తహసీల్దార్ అరుణ్ చంద్ర


పాడేరు మండలం కొత్తవలసలో నీట మునిగిన పంట పొలాలు


అనంతగిరి మండలం ఎగువశోభలో కూలిన పెంకింటిల్లు గోడ


కొయ్యూరు మండలం రేవడివీధిలో కూలిన పూరిల్లు


పాడేరు మండలంలో పునరావాస కేంద్రంలో నిర్వాసితులు


డౌనూరు సమీపంలో చింతపల్లి ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న కొండవాగు


జి.మాడుగుల మండలం సాలభం ఘాట్‌లో విరిగి పడిన కొండచరియలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

జి. మాడుగులలో వాగుల ఉధృతి

జి.మాడుగుల: మొంథా తుఫాన్ తాకిడి మండలంలో వాగులు ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. కల్వర్టులు గండిపడ్డాయి. కుంబిడిసింగి పంచాయతీ రాళ్లగెడ్డ ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి. పొలభం ఘాటీలో కొండచరియలు విరిగిపడడంతో తహసీల్దార్ రాజ్‌కుమార్ సందర్శించి, వాటి తొలగింపునకు చర్యలు చేపట్టారు. పాలమామిడి పంచాయతీ వనభంగిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి భారీ చింత చెట్టు పడి కె.నాగేశ్వరరావు అనే వ్యక్తి వంట షెడ్డు ధ్వంసమైంది. వంతాల పంచాయతీలో చిరుధాన్యాల పంటలు నేలకొరిగాయి. కొత్తపల్లి జలపాతంలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉరుము సమీపంలో కరెంటు స్తంభం నేలకొరిగింది. మండలంలో సహయక చర్యల్లో అధికారులు నిమగ్నమయ్యారు.


అనంతగిరి మండలం మాలింగవలస గెడ్డను పరిశీలిస్తున్న జడ్పీటీసీ , తహసీల్దార్, తదితరులు

శిథిల ప్రభుత్వ భవనాలను తొలగించాలి: కలెక్టర్

డుంబ్రిగుడ: మండల కేంద్రలో అభివృద్ధి పనులు పక్కాగా అమలుకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ దినేశ్ కుమార్ ఆదేశించారు. గ్రామంలో బుధవారం ఆయన తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న నివాస గృహలను పరిశీలించారు. ఏకో టూరిజం ద్వారా అభివృద్ధి చేసిన చాపారాయి జలవిహారి ఆదా యంలో పంచాయతీకి 20శాతం కేటాయించాలని ఎంపీటీసీ సభ్యురాలు గీత, సర్పంచ్ వెంకటరావు విన్నవించారు. ఈ మేరకు ఐటీడీఏ చర్యలు తీసుకునేలా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ త్రివేణికి ఆదేశించారు. అనంతరం నేలమట్టమైన వంతర్ల పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అనంతరం శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను గుర్తించి నెల రోజుల్లోగా తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బారావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి అధికారులు, పాల్గొన్నారు.


సిరసవలసలో చెట్టు కూలి ధ్వంసమైన ఇల్లు

ఇళ్లపై చెట్లు కూలి భారీ నష్టం

భారీ వర్షానికి పలు గ్రామాల్లో నివాస గృహలపై వృక్షాలు పడి నష్టం జరిగింది. వరి చేలు నేలకొరిగాయి. కించుమండ, ఒంటిపాక, కితలంగి, సంపంగి గెడ్డ, చాపరాయి గెడ్డల వద్ద వంతెనల పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. బుధవారం కించుమండలో జరిగే వారపు సంతను నిలిపివేశారు. వంతెనల వద్ద ప్రజలు ప్రయాణాలు జరపకుండా పోలీసుశాఖ, రెవెన్యూ శాఖ, సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

గూడెంకొత్తవీధి: చింతపల్లి, జీకేవీధి ప్రధాన రహదారి ఆర్‌వీనగర్ గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున భారీ వృక్షం రహదారికి అడ్డంగా కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానిక ఎస్ఐ కె. సరేశ్ కుమార్ రెండు ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి వృక్షశకలాలను తొలగించారు. దీంతో రెండు గంటల తరువాత రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

మత్స్యగెడ్డ ఉగ్రరూపం

పెదబయలు: వర్షాలతో పెదకోడపల్లి, జామిగూడ పంచాయతీలో అనేక గ్రామాల ప్రజలు మూడురోజులుగా బాహ్య సంబంధాలు తెగిపోయాయి. పెదకోడపల్లి పంచాయితీలోని పరధానిపుట్టు వంతెనపై వరద పోటెత్తింది. దీంతో బుధవారం ఉదయం తహశీల్దార్ త్రినాధరావు నాయుడు, ఎస్ఐ కొల్లి రమణ ఆధ్వర్యంలో వంతెనకు రెండు వైపులా బారికేడ్లను అమర్చి రాకపోకలను నిషేధించారు. దీంతో పెదకోడపల్లి, కిముడుపల్లి, కుంతుర్ల పంచాయతీల ప్రజలు గ్రామాలకే పరిమతమయ్యారు. జామిగూడ పంచాయితీలోని మత్స్యగడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో గడ్డ అవతల 6 గ్రామాల గిరిజనులు నిత్యావసరాలకు ఇబ్బంది పడ్డారు. పంట నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ నరంజి ప్రసాద్ తెలిపారు. లక్ష్మీపేట పంచాయితీ కిలుములు గ్రా మాన్ని బుధవారం ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో సందర్శించారు. 10 ఎకరాల్లో వరికి నష్టవాటిల్లినట్టు గుర్తించారు.

రెండు పునరావాస కేంద్రాల్లో 36 మందికి ఆశ్రయం

పాడేరురూరల్: తుఫాన్ నేపథ్యంలో వనుగుపల్లి, మినుములూరు పంచాయతీల్లో గృహాలు దెబ్బతిన్న 14 కుటుంబాలకు చెందిన 36 మందికి రెండు చోట్ల పురావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు స్థానిక తహసీల్దార్ డి.అరుణ్ చంద్ర తెలిపారు. గబ్బంగి పంచాయతీ గడివలసలో 5 కుటుంబాలకు చెందిన 18 మంది సభ్యులకు గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పునరావాసం ఏర్పాటు చేశామన్నారు. రాయిగెడ్డ, దిగువమోదాపుట్టు, కోడిగుడ్డు గ్రామ సమీపంలోని గెడ్డల కాజ్‌వేల వద్ద రాకపోకలను నిషేధించామన్నారు. అవసరమైన వారు తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్: 8555871772కు సమాచారమందించాలని కోరారు. కార్యాలయ సిబ్బంది బజ్జంగి నల్లన్న, వీఆర్‌వోలు, పాల్గొన్నారు.

క్షణాల్లోనే సహాయక చర్యలు

పాడేరు ఘాట్‌లో వంట్లమామిడి పంచాయతీ రాజాపురం సమీపంలో భారీ వృక్షాలు ప్రధాన రహదారికి అడ్డంగా పడిన విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ అధికారులు తక్షణమే అక్కడికి చేరుకున్నారు. రెండు ఎక్స్‌కవేటర్లతో వృక్షాలను తొలగించి వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. పాడేరు-జి.మాడుగుల ప్రధాన రహదారిలో జేసీ బంగ్లాకు సమీపంలో కొండపై నుంచి ప్రధాన రహదారిపైకి జారిపడిన బండరాళ్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు, తహసీల్దార్ డి.అరుణ్ చంద్ర, ఎస్ఐ ఎల్.సురేశ్, రెవెన్యూ అధికారులు బి.నల్లన్న, పోలీస్, ఆర్అండ్‌బీ సిబ్బంది పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచ్ ప్రతినిధులు బుధవారం పలు గ్రామాలను సందర్శించి తుఫాను బాధితులకు సహాయ చర్యలను చేపట్టారు. వంట సామగ్రి, టార్పాలిన్లు, నిత్యావసరాలు అందించారు. సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్రా నాగరాజు, ప్రతినిధులు ఎస్.గంగరాజు, జి.గౌరీ శంకరరావు, పి.సూర్యారావు, టి.ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

ఇళ్లలోకి నీరు.. కూలిన విద్యుత్ స్తంభాలు

భారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి ఇళ్లు కూలిపోవడంతో సుమారు 42 కుటుంబాలకు చెందిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దుమ్మాపుట్టులో మజ్జి కృష్ణబాబుకు చెందిన పెంకిటిల్లు కూలిపోయింది. సలుగు పంచాయతీ బూరుగుచట్టులో నివాస గృహాల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందికి గురయ్యారు. పొలాలు నీటమునిగాయి. పాడేరు ఆర్టీసీ డిపో వద్ద, పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాలు నుంచి నందిగరువు, ఓనూరు గ్రామాలకు వెళ్లే దారిలో భారీ వృక్షాలు పడి నాలుగు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఏఈ వెంకటరమణ, ఎల్ఐ త్రిమూర్తులు, ఎల్ఎం శ్రీనివాస్, సీహెచ్. ఎర్రిబాబు పాల్గొన్నారు. గ్రామాలకు తహసీల్దార్ డి.అరుణ్ చంద్ర సిబ్బందితో వెళ్లి తుఫాన్ నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

హుకుంపేట అతలాకుతలం

- పొంగిన గెడ్డలు వంతెనలు. కూలిన చెట్లు, ఇళ్లు
- రాకపోకలు అంతరాయం

హుకుంపేట; మండలంలోని చిడిపుట్టు, పట్టం, ఒంటిపాక, ఓల్డా, లివిటి, సూకురు, తడిగిరి వంతెనలపైనుంచి వరద నీటి ప్రవహంతో ఉధ్రిక్త పరిస్థితి నెలకొన్నాయి. గిరిజనులు, ప్రభుత్వ ఉద్యోగుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మంగళవారం తెల్లవారుజామున పట్టాం పంచాయతీ భూరువలసకు చెందిన సింగరపు అప్పారావు పూ రింటి గోడ కూలిపోయింది. కుటుంబ సభ్యులకు ఎటువంటి ప్రాణా నష్టం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. హుకుంపేటలో బుర్ది పార్వతి ఇంటి మట్టి గోడ కూలిపోయింది. ఇంటి చుట్టూ ఉన్న భారీ టేకు చెట్టు ఉదయం కూలి లింటల్ వరకు నిర్మాణం చేసిన గృహం పడ్డాయి. బాకూరు రోడ్డులోనూ భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. స్థానికులు వీటిని వెంటనే తొలగించారు. అసంపూర్తి, శిథిలావస్థలో గల ఇళ్లలోని ఉంటున్న కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. సూకురు, మాసాడ, రంగశీల, టీడీ వలసలలో వరి చేలు నీటి మునిగాయి. హుకుంపేట వ్యవసాయ బావులు, రక్షిత పథకం ట్యాంక్‌ల్లో గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


మాసాడలో నీటిమునిగిన పొలాలను పరిశీలిస్తున్న శ్రావణ్‌కుమార్

హుకుంపేట అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానకు పంట నష్టపోయిన ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ మంత్రి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మాసాడ గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. చిడిపుట్టు వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పంట నష్టంపై సర్వే చేపట్టి పరిహారం అందించేలా చూడాలన్నారు. వరదకు కొట్టుకుపోయిన వంతెనల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. చీడిపుట్టు వంతెన వద్ద ప్రవాహం తగ్గే వరకు పోలిసు శాఖ గస్తీ చేయాలని సూచించారు. టీడీపీ నేతలు సాగరి సుబ్బారావు, పండు రంగ స్వామి, ఎంపీటీసీ సభ్యుడు కొమ్మ రమ , సాగరి సత్యవతి, సూర్యకాంతం, వాసుదేవ్, బొంజుబాబు, నూకరాజు, బాకూరు రమణ, మురళి, శివసాగర్, మహేశ్, స్వామి రాజు, రైతులు ఉన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధి కృషి: జడ్పీ చైర్‌పర్సన్


సరియాపల్లిలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీచైర్‌పర్సన్ సుభద్ర, తదితరులు

ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): జడ్పీ నిధులతో గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ జల్లాపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ సరియాపుట్టు గ్రామంలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు, గుమ్మసిరగంపుట్టు సమీపంలోని బరడ వద్ద రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్‌లు సుభాశ్‌చంద్ర, నరసింగరావు, గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి, కమల, నబ్బోచ గణపతి, జగబంధు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత ప్రాంతాల్లో తాగునీటి సరఫరా


పాడేరులో తాగునీటిని సరఫరా చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు

పాడేరురూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో పట్టణ ప్రజలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు బుధవారం రెండు ట్యాకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. లోచిపుట్టు, రామాలయంవీధి, ప్రభుత్వ ఆస్పత్రి, సుంద్రుపుట్టు, పీఎంఆర్సీ రేకుల కాలనీ, గడ్డికాలనీ, బక్కులపనుకు, సినిమాహాలు సెంటర్‌లో తాగునీటిని సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, పంచాయతీ ఈవో పీఆర్ అండ్ ఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేష్, వార్డు సభ్యురాలు పాంగి నర్సమ్మ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి, జీకే వీధిలో..

చింతపల్లి/గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల జనరేటర్ల సహాయంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రక్షిత నీటి సరఫరా చేశారు. బుధవారం ప్రధానంగా చింతపల్లి సీపీడబ్ల్యూ పథకం, జీకేవీధి, రింతాడ రక్షిత మంచి పథకం ట్యాంక్‌లకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కురుణ, ఏఈఈలు స్వర్ణలత, కల్యాణ్‌రామ్ జనరేటర్ ఏ ర్పాటు చేశారు. వీటిసాయంతో కొళాయిల ద్వారా నీటి సరఫరా చేశారు. చింతపల్లిలో స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి ఆదేశాలతో సర్పంచ్ దురియా పుష్పలత సూచనలపై కార్యదర్శి ముక్కలి వెంకట రమణ పలు వీధుల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాను చేశారు.


రింతాడలో మంచి నీటి పథకానికి జనరేటర్ ఏర్పాటు చేసిన డీఈఈ కరుణ

ఆరు గృహాలు పాక్షికంగా ధ్వంసం

చింతపల్లి: మండలంలో వర్షాలకు ఆరు గృహాలు పాక్షికంగా ధ్వంసమైనట్టు స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. ఎ. శనివారం గ్రామంలో వర్షాలకు మూడు గృహాలు, వంతమామిడిలో ఒకటి, రాళ్లగెడ్డలో ఒకటి, తాజంగిలో రెండు గృహాలుపై వృక్షాలు పడడంతో పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు.

వెలవెలబోయిన వారపు సంత

చింతపల్లి: మండల కేం ద్రంలో వారపు సంత వెలవెలబోయింది. బుధవారం వర్షంతో మైదాన ప్రాంతాల నుంచి వర్తకులు సంతకు రాలేదు. స్థానిక గిరిజన రైతులు దుకాణాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు ఉండి, తిరిగికూరగాయలను తిరిగి గిరిజనులు ఇళ్లకు తీసుకొని వెళ్లిపోయారు.

తప్పిన ప్రమాదం

ముంచంగిపుట్టు: జర్రెల పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన కొర్రా సోనాయి ఇంటిగోడ కూలిపోయింది. అయితే ఆ సమయంలో ఆమె లేకపోవడం పెను ప్రమాదం తప్పినట్టు వార్డు మెంబర్ పరశురామ్, పెసా కమిటీ కార్యదర్శి జీనబంధు తెలిపారు.

రోగులకు అసౌకర్యం లేకుండా చూడాలి


రోగులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్.హేమలతా దేవి

పాడేరురూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని ఆస్పత్రి ముఖ్య పర్యవేక్షణాధికారిణి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.డి.హేమలతా దేవి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె ఆస్పత్రిలోని ప్రతీ వార్డును సందర్శించారు. ప్రసూతి విభాగంలో ఉన్న గర్భిణులు, బాలింతలను పరామర్శించారు. రోగులకు అందుతున్న సౌకర్యాల గూర్చి అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రిల విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చూపాలన్నారు. డాక్టర్ సృజన, డాక్టర్.జి.వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి వెండి కిరీటం బహూకరణ


వెండి కిరిటంతో ఊరేగింపుగా వెళ్తున్న దాతలు, అయ్యప్పస్వాములు

సీలేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు అయ్యప్పస్వామి ఆలయంలో గల అయ్యప్పస్వామి వారికి అరకిలో వెండి కిరీటాన్ని బుధవారం బహూకరించారు. సీలేరుకు చెందిన ఏపీ జెన్‌కో ఉద్యోగి లేటు జగ్గారావు కుమార్తె కీర్తి తన తండ్రి జ్ఞాపకార్థం ఈ కిరీటాన్ని తయారు చేయించిన ఆయల కమిటీ సభ్యులకు అందజేశారు.


మాకవరపాలెం ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం


చోడవరం మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో నీటి ముంపులో ఉన్న సరుగుడు తోటలు


మాడుగుల మండలంలోని ఎం.కోడూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తాచేరు నది

భారీ వర్షం.. అతలాకుతలం

ఎడతెరిపి లేని వానతో లోతట్టు ప్రాంతాలు జలమయం
ఛిద్రమైన రహదారులు.. నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
రాకపోకలకు గ్రామీణులు, వాహన చోదకుల పడరాని పాట్లు
ముంపులోనే పంట పొలాలు.. లబోదిబోమంటున్న రైతులు

మొంథా తుఫాన్ ముంచేసింది. జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో కుండపోత వాన పడింది. సోమవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షాలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. అన్ని మండలాల్లోనూ రహదారులు ఛిద్రమయ్యాయి. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. చాలా చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వంతెనలు, కాజ్‌వేలపై నుంచి నీరు ఏరులా పారుతోంది. దీంతో వాహన చోదకులు, గ్రామీణ ప్రజలు, రైతులు, కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లోనూ తుఫాన్ ప్రభావం చూపింది. చోడవరంలోని శారదా, పెద్దేరు నదులకు వరద ఉధృతి ఎక్కువగా ఉండడం, పెద్దేరు, కోనాం, రైవాడ రిజర్వాయర్ల నుంచి నీరు భారీగా దిగువకు విడిచిపెట్టడంతో లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లో నీరు బయటకు పోయే దారి లేకపోవడంతో నీట మునిగే ఉన్నాయి. కన్నంపాలెం, తిమ్మనపాలెం ప్రాంతాల్లో వరి, చెరకు, సరుగుడు తోటలు నీటిలోనే ఉన్నాయి. అలాగే పీఎస్ పేట, జెన్నవోలు, గౌరీపట్నం, ప్రాంతాల్లో పంటపొలాల్లోకి భారీగా నీరు చేరింది. జన్నవరంలో కూరగాయల పంటలు కూడా నీటమునిగాయి. రావికమతం మండలంలో రేయింబవళ్లు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరగా, మరో పక్క గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రావికమతం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వర్షం నీరు భారీగా చేరడంతో మోటారు పెట్టి పైకి తోడారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఓ ఇంట్లోకి వర్షపు నీరు చేరింది. బుధవారం


గొలుగొండ మండలంలోని ఏటిగైరంపేట సమీపంలో పొంగిన రాళ్ల గెడ్డ

ఉదయం నుంచి వర్షం ఏకధాటిగా కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కొమిరలో 50 ఎకరాలు వరి నేలకొరగా, మట్టవానిపాలెంలో నల్లకొండ గెడ్డ పొంగడంతో సుమారు వంద ఎకరాలు నీటి ముంపులోనే ఉంది. రావికమతం అద్దిపల్లి గెడ్డ ఉధృతితో పెద్దిరాజు చెరువు నిండిపోయి దాన్ని ఆనుకొని ఉన్న పొలాల్లో వరి పీకల్లోతు నీటిలో ఉంది. దీంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది, విజయరామరాజుపేటలలో కాజ్‌వేల వద్ద వరద నీరు ఉధృతంగా పారుతోంది. దీంతోబీఎన్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. అలాగే చోడవరం-వడ్డాది మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డైవర్షన్ రోడ్డును కూడా అధికారులు తాత్కాలికంగా మూసేశారు. పెద్దేరు నదిపై నిర్మించిన కాజ్‌వేపై వరద నీటి ప్రవాహం కారణంగా భారీ వాహనాలను తాత్కాలికంగా నిలిపివే


మాకవరపాలెం: వర్షాలకు అధ్వానంగా మారిన జి.వెంకటాపురం రోడ్డు


రావికమతం సబ్ స్టేషన్‌లో వర్షపు నీటిని మోటార్‌తో తోడుతున్న సిబ్బంది

శారు. బీఎన్ రోడ్డు గుంతల్లో నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వడ్డాది, విజయరామరాజుపేటలలో పునరావాస కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి గోపాలరాజు, తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో శివప్రసాద్, ఎంఈవో బి.కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పరిశీలించారు. బాధితులతో మాట్లాడి భోజన, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. అలాగే రోలుగుంట మండలంలో మొంథా తుఫాన్ ప్రభావం చూపింది. పలు గ్రామాల రహదారులు ఛిద్రమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి.


నాతవరం మండలంలోని డొంకాడ అగ్రహారంలో దెబ్బతిన్న ఇల్లు

నర్సీపట్నం నియోజకవర్గంలో...

నర్సీపట్నం/నర్సీపట్నం అర్బన్/మాకవరపాలెం/నాతవరం/గొలుగొండ/కృష్ణాదేవిపేట: నర్సీపట్నం నియోజకవర్గంలో మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. నర్సీపట్నంలోని పీనారిపాలెంలో చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ తీగల మీద పడ్డాయి. అగ్నిమాపక అధికారి అప్పలస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది చెట్టుకొమ్మలను కట్టర్‌తో తొలగించారు. విద్యుత్ శాఖ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రావణాపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే పంట కాలువకు గండి పడింది. పూర్తి స్థాయిలో గండి పడితే 20 నుంచి 30 ఎకరాల వరకు పంటలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మాకవరపాలెం మండలంలో బుధవారం ఉదయం నుంచి భారీగా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. పలు

గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. రామన్నపాలెం రోడ్డు మధ్యలో ఏలేరు వంతెన వద్ద గోతుల్లో నీరు భారీగా చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామన్నపాలెం, జి.వెంకటాపురం, ఎరకన్నపాలెం, ధర్మవరం, జి.కోడూరు రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. గొలుగొండ మండలంలోని ఏటిగైరంపేట సమీపంలో రాళ్లగెడ్డ పొంగి ప్రవహించింది. ఏటిగైరంపేట గ్రామంపైకి గెడ్డ


బుచ్చెయ్యపేట మండలంలోని విజయరామరాజుపేట రహదారిలో రాకపోకలు మూసివేసిన దృశ్యం

నీరు వస్తున్నదనిగ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. దీంతో అధికారులు స్పందించి గెడ్డలో పూడిక తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగశింగి, లింగంపేట, గింజర్తి, విప్పలపాలెం, పల్లావూరు తదితర గ్రామాల్లో బుధవారం ఉదయం నుండి వర్షంతో పాటు ఈదురు గాలులు వీయడంతో చెట్లు నేలకొరిగాయి. అలాగే గ్రామీణ రహదారుల గోతుల్లో నీరు చేరడంతో అధ్వానంగా మారాయి. లింగంపేటలో ఈదురు గాలులతో ఇళ్ల ముందు పెద్ద చెట్టు నేలకొరిగింది.

నాతవరం మండలంలోని నాతవరం, జిల్లేడిపూడి, సరుగుడు, మాధవనగరం, గునుపూడి తదితర గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. తహశీల్దార్ వేణుగోపాల్ వీటిని పరిశీలించారు. మాధవనగరంలో ఓ ఇంటిపై చెట్టు కూలిపోయింది. నాతవరం, వైబీపట్నం రామన్నపాలెం సరుగుడు, సుందరకోట, ఎస్‌బీపట్నం చమ్మచింత గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో రెండు వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తుఫాన్ బాధితు


దేవరాపల్లి: తామరబ్బ వంతెనపై రాకపోకలు నిలిపివేస్తున్న పోలీసులు


నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో విద్యుత్ వైర్లపై పడిపోయిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లను పరామర్శించి సాయం గురించి అడిగి తెలుసుకున్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/మాడుగుల రూరల్/దేవరాపల్లి/కె.కోటపాడు/చీడికాడ: మాడుగుల నియోజకవర్గాన్ని మొంథా తుఫాన్ ప్రభావం వదల్లేదు. అన్ని మండలాల్లోనూ ముసురు వాతావరణం నెలకొంది. మాడుగుల మండలంలో బుధవారం కూడా దపదఫాలుగా వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో నివాసితులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పునరావస కేంద్రాలకు తరలించి వసతి, భోజన సదుపాయాలను కల్పించారు. పెద్దేరు, తాచేరు నదులు పొంగి ప్రవవహిస్తున్నాయి. తాచేరు నదికి గెడ్డలు, పంట కాలువల ద్వారా నీరు జోరుగా పారుతోంది. ఎం.కోడూరు, జంపెన, లోవగవరవరం, వీరవిల్లిఅగ్రహారం, కేజేపురం గ్రామాల వద్ద నదుల ప్రవాహం ఎక్కువైంది. దేవరాపల్లి మండలంలోని నాగయ్యపేట శివారు సీతంపేట వద్ద కృష్ణుడి కోవెల ముందు రోడ్డుకు అడ్డంగా చెట్టు పడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వీర్వో జానకి వెంటనే తొలగించి ఇబ్బందులు తొలగించారు. సమ్మెద, తామరబ్బ బ్రిడ్జిలపై నుంచి వరద నీరు పారడంతో రాక


కె.కోటపాడులో రోడ్డుపై నేలకొరిగిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

పోకలు జరగకుండా ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందిని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల్లో తొమ్మిది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏఈఈ కర్రి శంకరరావు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. కె.కోటపాడు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులకు వృక్షాలు నేలకొరిగి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. చౌడువాడ-వెంకన్నపాలెం రోడ్డులో మద్దాల వారి కల్లాల వద్ద మర్రిచెట్టు ఎల్‌టీ విద్యుత్‌లైన్‌పై పడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఏఈ చంద్రశేఖర్ సిబ్బందితో చెట్ల కొమ్మలు తొలగించి సరఫరాను పునరుద్ధరించారు. కె.కోటపాడు-పెందుర్తి రోడ్డుకు ఇరుపక్కల చెట్లు పడిపోవడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగింది. చంద్రయ్యపేట వద్ద కల్వర్టు ధ్వంసమైంది. అలాగే చీడికాడ మండలాన్ని మొంథా తుఫాన్ అతలాకుతలం చేసింది. చుక్కపల్లి గ్రామంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. నాని బంధ, గంటావాని చెరువులు వర్షం నీటితో పూర్తిగా నిండిపోయాయి. అలాగే పలు గ్రామాల్లో చెట్లు నేలకూలాయి.

కుంగిన రావణాపల్లి ఆనకట్ట గట్టు


ఆనకట్ట గట్టు పటిష్టకు చర్యలు చేపడుతున్న ఆర్డీవో, డీఈఈ

నర్సీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రావణాపల్లి ఆనకట్ట గట్టు కుంగడంతో చర్యలు చేపట్టడానికి జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. గత ఏడాది జూలైలో రిజర్వాయర్ మదుం కోతకు గురైన విషయం తెలిసిందే. అప్పుడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తాజాగా బుధవారం గట్టు కుంగిన విషయాన్ని సిబ్బంది, రైతులు ఏఈ రామన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. రిజర్వాయర్ గట్టుకు అమర్చిన రాతి పేర్పు జారిపోవడంతో గట్టు కుంగినట్టు జలవనరుల శాఖ అధికారులు గుర్తించారు. ఆర్డీవో వీవీరమణ, తహసీల్దార్ రామారావు, ఇరిగేషన్ డీఈఈ బాలశూర్యం వెళ్లి గట్టు పటిష్టం చేయడానికి చర్యలు చేపట్టారు. కుంగిన ప్రదేశంలో కంకరతో పూడ్చి, రాతి పేర్పునకు దన్నుగా ఇసుక బస్తాలతో పటిష్టపరిచామని ఏఈ తెలిపారు.

సుప్రీం తీర్పుపై హెల్త్ అసిస్టెంట్ల హర్షం


సుప్రీం తీర్పుపై న్యాయవాదులతో కలిసి హర్షం వ్యక్తం చేస్తున్న హెచ్‌ఏలు

చోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఉమ్మడి జిల్లా మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల సంఘం కన్వీనర్ బి.ఎలీషారావు హర్షం వ్యక్తం చేశారు. 2003 నుంచి సుమారు 28 ఏళ్లుగా రాష్ట్రంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమను తొలగిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ, మంగళవారం సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం ఆనందదాయకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్పుతో తొలగింపునకు గురైన 920 మంది హెల్త్ అసిస్టెంట్లకు, వారిపై ఆధారపడిన కుటుంబాలకు ఊరట లభించినట్టయిందన్నారు. ఈ సందర్భంగా తమకు అనుకూలంగా సుప్రీం కోర్టులో అఫిడవిట్ వేసిన సీఎం చంద్రబాబునాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు, ఉద్యోగ సంఘం నాయకులకు ఎలీషారావు కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవితాలు నిలబెట్టిన కూటమి ప్రభుత్వానికి మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లంతా రుణపడి ఉంటారని ఆయన తెలిపారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

దేవరాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం పర్యటించారు. దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, అధికారులతో కలిసి ఆమె పర్యటన చేశారు. బుధవారం పరిశీలించారు. దేవరాపల్లిలోని రైవాడ స్పిల్‌వే గేట్ల పైకి వెళ్లి పరిశీలించారు. వరదనీరు విడుదల చేయడంలో ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైవాడ అతిథి గృహంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రహదారులకు అడ్డంగా పడిన చెట్లను తొలగించాలని, ప్రజా జీవనానికి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు తాగునీరు, ఆహారం అందించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి మంజులవాణి, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో, సువర్ణరాజు, సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ సత్యనారాయణ, ఇరిగేషన్ అధికారులు త్రినాథం, సత్యంనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అలాగే చీడికాడ మండలంలో చుక్కపల్లి రహదారిపై నిలిచిపోయిన వర్షం


చీడికాడ రోడ్డుపై నిలచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌కృష్ణన్

నీటిని కలెక్టర్ పరిశీలించారు. ఈ గ్రామంలోని చెరువుల్లో ఆక్రమణలు తొలగించి నీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్ మూర్తి, తహశీల్దార్ కిశోర్ లింకన్, ఎంపీడీవో వి.రామసుందరరావు, ఆర్ఐ కృష్ణ, సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 355 కుటుంబాలకు పునరావాసం

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలో 19 పునరావాస కేంద్రాల్లోని 355 కుటుంబాలకు పునరావాసం కల్పించినట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. స్థానిక మండల పరిత్‌కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూరి గుడెసెలు, పాత ఇళ్లల్లో నివాసం ఉంటున్నవారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా 158 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందన్నారు. గత ప్రభుత్వం సాగునీటి వనరులను నిర్వక్ష్యం చేసిందని చెప్పారు. రైవాడ వైపు గత ఐదేళ్ల చూసిన పాపాన పోలేదన్నారు. సెన్సార్ ఉంటే ఎప్పటికప్పుడు నీటి మట్టాలు సులభంగా గుర్తించేవారమన్నారు. రైవాడకు అదనంగా మరో జనరేటర్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తుఫాన్ వల్ల నష్టం జరగకుండా అధికారులను సీఎం చంద్రబాబు ముందస్తుగా అప్రమత్తం చేయడంతో పాటు నిద్రహారాలు లేకుండా శ్రమిస్తున్నారని


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మంజులవాణి, తహశీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజు, మాజీ ఎంపీపీ కె.భాస్కరరావు, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

అమలాపురంలో వైసీపీ కోటి సంతకాల సేకరణ

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అమలాపురంలో గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవీకరణ వల్ల ఈ ప్రాంతంలో పేద ప్రజలకు ఉచిత వైద్యం అందదని చెప్పారు. అంతేకాకుండా పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్య దూరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరత్నం, సర్పంచ్ శెట్టి శ్రీను, సుర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారుల బెదిరింపులు అరికట్టాలి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి సర్వే నంబర్ 156లో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై ఫిర్యాదులు చేసినందున బెదిరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆక్రమిత ప్రాంతంలో రెవెన్యూ అధికారులు మొక్కలను తొలగించడంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో ఆక్రమణదారులు తమను బెదిరిస్తున్నారని సర్పంచ్ సీతా పైడినాయుడు, గ్రామస్థులు ఆరోపించారు. బెదిరింపులను అరికట్టాలని పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

'రోలుగుంట సూరి గ్లింప్స్' విడుదల



రోలుగుంట సూరి గ్లింప్స్ విడుదల చేస్తున్న స్పీకర్

నర్సీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తపస్వీ ఆర్ట్స్ క్రియేషన్స్ బేనర్‌పై అనిల్‌కుమార్ పల్లా దర్శకత్వంలో రూపొందించిన రోలుగుంట సూరి గ్లింప్స్‌ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం విడుదల చేశారు. నర్సీపట్నంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో రూపొందించిన రోలుగుంట సూరి సినిమా వాస్తవికతకు దగ్గరగా రూపొందించడం అభినందనీయమన్నారు. నిర్మాతలు పల్లా సౌమ్య చాందిని, ఊరికూటి తాతారావు, పల్లా సత్యనారాయణ, హీరో పల్లా నాగార్జున, హీరోయిన్ ఆధ్యరెడ్డి, ఇతర నటీనటులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరణం ఈశ్వరరావు, ఆదిరాజు, రాయపురెడ్డి శ్రీను పాల్గొన్నారు.

రేపటి నుంచి బాలల ప్రతిభా పాటవ పోటీలు

నర్సీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ బాలల దినోత్సవంలో భాగంగా శుక్రవారం నుంచి బాలల ప్రతిభా పోటీలు నిర్వహించనున్నారు. నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ శుక్రవారం చిత్రలేఖనం పోటీలు ప్రారంభిస్తారు. అలాగే నవంబరు 1న దేశభక్తి గీతాలు, 3న పద్య పఠనం, 5న వక్తృత్వ, 6న క్విజ్, 7న మట్టితో కళాకృతులు, 8న కాగితాలతో కళాకృతులు, 9న హిందీ భాష ప్రాధాన్య మీద డిబేట్, 13 విచిత్ర వేషధారణ, జానపద నృత్యాలు స్కూట్నీ నిర్వహిస్తామని డీజీనాథ్ తెలిపారు. 14వ తేదీన సిటీ క్లబ్ ఆవరణలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించి పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయన చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చోడవరం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీవీఎస్‌జే ఆంజనేయులు తెలిపారు. ఈ సభ్య సమావేశానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

మాడుగుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏఈడీ వి.చిట్టినాయుడు సూచించారు. మండల కేంద్రంలో పాడి రైతులతో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పశువులను పాడుబడిన పాకల్లో ఉంచరాదన్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న చోటకు పశువులను పంపరాదన్నారు. పశువులు, మేకలు, గొర్రెలు కోళ్లు తుఫాన్ సమయంలో మరణిస్తే పశు వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. వైద్యం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని కోరారు.

ముంచెత్తిన వాన

'మొంథా' తుఫాన్ తీరం దాటే సమయంలో, ఆ తరువాత జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిశాయి. నదులు, వాగులు, గెడ్డలు వరద నీటితో పోటెత్తాయి. చెరువులన్నీ పూర్తిగా నిండిపోయి అలుగులు పారాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఈదురు గాలుల కారణంగా పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఆయా శాఖల సిబ్బంది వెంటనే స్పందించి సహాయ, పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎక్కడా ప్రాణనష్టం సంభవించలేదు. తుఫాన్ కారణంగా రైతులు ఎక్కువ నష్టపోయారు. ప్రభుత్వ శాఖలకు వచ్చేసరికి విద్యుత్తు, నీటిపారుదల, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్ శాఖలకు ఎక్కువ వాటిల్లింది. బుధవారం వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ ముంపు తొలగలేదు.


అనకాపల్లి వద్ద ఉధృతంగా శారదా నది ప్రవాహం


బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వద్ద కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు


ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా నది


అనకాపల్లి తోటాడ జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై కూలిన చెట్టు


అనకాపల్లి మండలం వెంకుపాలెం వద్ద వెదుళ్లగెడ్డ ఉధృతి


కశింకోట మండలం వెదురుపర్తి వద్ద పరవళ్లు తొక్కుతున్న శారదా నది


బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద మూసివేసిన కాజ్‌వే


రాంబిల్లి: కొత్తూరు వద్ద పాత వంతెన పైనుంచి ప్రవహిస్తున్న మేజర్ శారదా నది


నర్సీపట్నం: రావణాపల్లి ఆనకట్ట మీదుగా పారుతున్న నీరు


రావికమతం: కల్యాణపులోవ నుంచి విడుదలవుతున్న నీరు


అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద అల్లకల్లోలంగా ఉన్న సముద్రం


చోడవరం మండలం జన్నవరం వద్ద నీటమునిగిన బెండ, వంగ పంటలు

శారదా నదికి భారీగా వరద

» ప్రజలు అప్రమత్తంగా ఉండాలి » ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైవాడ జలాశయం నుంచి వరద నీటిని శారదానదిలోకి విడుదల చేశామని, నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుహిన్‌సిన్హా బుధవారం సూచించారు. రైవాడ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114.00 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 112.97 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం జలాశయానికి వస్తున్న వరద నీటి ప్రవాహం (ఇన్‌ఫ్లో) సుమారు 12 వేల క్యూసెక్కులుగా నమోదైందన్నారు. అధిక నీటిమట్టం కారణంగా జలాశయం స్పిల్‌వే ద్వారా మూడు గేట్లు తెరిచి సుమారు 12 వేల క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడుదల చేస్తున్నామన్నారు. దీంతో జలాశయం దిగువన ఉన్న గ్రామాలతో పాటు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అవసరం లేని సందర్భాల్లో నది పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక పోలీసులు, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

వరికి చీడపీడల బెడద

... 5వ పేజీ తరువాయి

నీటిని బయటకు పంపి, పడిపోయిన పైరును నిలగట్టాలని సూచించారు. ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రొపికోనజోల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే మానిపండు తెగులు అదుపులోకి వస్తుందన్నారు. ఆకుమడత పురుగు నివారణకు ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. చెరకు తోటల్లో నీటిని బయటకు పంపి ఎకరాకు యూరియా 25 కిలోలు, పొటాష్ 25 కిలోలు అదనంగా వేయాలని సూచించారు.

ముంపు పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

చోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో ముంపునకు గురైన వరి పొలాలను జిల్లా వనరుల కేంద్రానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. పొలాల్లో నీరు వీలైనంత త్వరగా బయటకు పోయేలా చూడాలని సూచించారు. బ్యాక్టీరియా ఎండాకు కనిపిస్తే ప్లాంటామైసిన్ మందును లీటరుకు ఒక ఎం.ఎల్. చొప్పున కలిసి పిచికారీ చేయాలని చేయాలని చెప్పారు. పాచి తెగులు, మానిపండు తెగులు సోకినట్టయితే ప్రొపికోనజోల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే పైమెట్రోజోన్, డైనో టెఫ్యూరాన్ మందును పిచికారీ చేయాలని కోరారు. ఈ బృందంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు రవికుమార్, డి.ఉమామహేశ్వరరావు, చంద్రశేఖర్ ఉన్నారు.

తమలపాకు రైతు కుదేలు

» 'పేట మండలంలో 100 ఎకరాల్లో నేలవాలిన తోటలు » ఎకరాకు రూ.లక్షపైగా నష్టపోయినట్టు రైతులు ఆవేదన

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీచిన బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు తమలపాకు రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. మండలంలోని సత్యవరం, మాసాహెబ్‌పేట, కొత్తూరు, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, తదితర గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో తమలపాకు తోటలు నేలకొరిగాయి. ఎకరాకు లక్ష రూపాయలకుపైగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో రైతులు కొత్తగా తమలపాకు తోటలు వేస్తుంటారు. ప్రస్తుతం ఇవి మొక్క తోటలుగా వున్నాయి. జనవరి తరువాత ఆకు దిగుబడి వస్తుంది. ఇక గత ఏడాది వేసిన తోటల్లో ఆకు దిగుబడి బాగుంది. తుఫాన్ గాలులకు తోటలు (తమలపాకు తీగలు పాకడానికి ఊతంగా వుండే అవిసె చెట్లు) నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన శాఖ ఇన్‌చార్జి అధికారి సాయిప్రియ పలు గ్రామాల్లో పర్యటించి తమలపాకు తోటలను పరిశీలించారు. మండలంలో సుమారు 100 ఎకరాల్లో తమలపాకు తోటలు పూర్తిగా దెబ్బతిన్నట్టు ఆమె తెలిపారు.


మాసాహెబ్‌పేటలో నేలకొరిగిన తమలపాకు తోటలో రైతులు

ముంచిన మొంథా

... 5వ పేజీ తరువాయి

పాడైంది. ఈదురు గాలులతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 33 చెట్లు నేలకొరిగాయి. అత్యధికంగా జీవీఎంసీ అనకాపల్లి పరిధిలో 15 చెట్లు, ఎలమంచిలిఓల పది చెట్లు పడిపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది వెళ్లి, పడిపోయిన చెట్లను యుద్ధప్రాతిపదికను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

అనకాపల్లి పట్టణ పరిధిలో తోటాడ జంక్షన్ వద్ద బుధవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై భారీవృక్షం కూలిపోయింది. దీంతో విశాఖ వైపు నుంచి తునివైపు వెళ్లే మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, విద్యుత్ అధికారులు, జీవీఎంసీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చెట్టును తొలగించారు. అనకాపల్లి మండలం తుమ్మపాలలో సుమారు 400 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. వర్షాలు తగ్గిన తరువాత క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేస్తామని ఏవో రంగాచారి చెప్పారు.

చోడవరం మండల పరిధిలో శారదా, పెద్దేరు నదుల్లో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో కన్నంపాలెం, తిమ్మనపాలెం ప్రాంతాల్లో వరి పొలాలు, చెరకు తోటలు రెండో రోజైన బుధవారం కూడా నీటిలో మునిగి వున్నాయి. పీఎస్‌పేట, బెన్నవోలు, గౌరీపట్నం ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి భారీగా నీరు నిలిచింది.

కాజ్‌వేలు మూసివేత

బుచ్చెయ్యపేట మండలంలో పెద్దేరు, తాచేరు నదుల్లో వరద ఉధృతి అధికం కావడంతో వడ్డాది, విజయరామరాజుపేటల వద్ద కాజ్‌వేలను అధికారులు మూసివేశారు. చోడవరం వైపు నుంచి మాడుగుల, పాడేరు వైపు వెళ్లే బస్సులు, లారీలను విజయరామరాజుపేట నుంచి కేజేపురం మీదుగా మళ్లించారు. వడ్డాది వద్ద కాజ్‌వే మీదుగా పెద్దేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చోడవరం నుంచి వడ్డాది, రావికమతం వైపు వచ్చే బస్సులు, లారీలను గౌరీపట్నం మీదుగా మళ్లించారు. తేలికపాటి వాహనాలను పాత వంతెన మీదుగా అనుమతించారు.

ఎలమంచిలి పట్టణంలో బుధవారం ఉదయం ఈదురు గాలులు వీచడంతో పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో ఈపీడీసీఎల్ అధికారులు సుమారు నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కరెంటు వైర్లపై పడిన కొమ్మలను తొలగించిన తరువాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పట్టణంలో పలుచోట్ల కూలిన చెట్లు, విరిగిన కొమ్మలను మునిసిపల్ సిబ్బంది వేగంగా తొలగించారు.

రావికమతం మండలం కొమిరలో 50 ఎకరాల్లో వరిపైరు నేలవాలింది. మట్టవానిపాలెంలో నల్ల కొండగెడ్డ పొంగడంతో సుమారు వంద ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది.

అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద మంగళవారం రాత్రి సముద్రంలో అలల తీవ్ర పెరిగింది. సుమారు వంద అడుగుల మేర సముద్రం ముందుకు వచ్చింది. బస్టాండ్ వద్ద ఉన్న రక్షణ గోడను అలలు తాకాయి. కడపాలెంలో కొబ్బరి, తాటి చెట్లు కూలిపోయాయి. పలుగ్రామాలు చెట్లు, కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. ఈపీడీసీఎల్ సిబ్బంది వచ్చి చెట్లను తొలగించి, సరఫరాను పునరుద్ధరించారు.

తగ్గిన వర్షం..

అనకాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం కూడా ముసురు వాతావరణం నెలకొంది. మంగళవారంతో పోలిస్తే బాగాఆ తగ్గింది. రోజంతా తేలికపాటి జల్లులు కురుస్తూనే ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలు... చోడవరం మండలంలో 11.4 మిల్లీమీటర్లు, మాకవరపాలెంలో 10.2, అనకాపల్లిలో 9.8, సబ్బవరంలో 7.6, రాంబిల్లిలో 3, మునగపాకలో 7.3, పరవాడలో 4.4, కె.కోటపాడులో 7.4, బుచ్చెయ్యపేటలో 9.8, అచ్యుతాపురంలో 9.8, రావికమతంలో 8.4, రోలుగుంటలో 6.4, కశింకోటలో 3.2, నక్కపల్లిలో 1.8, ఎలమంచిలిలో 5, ఎస్.రాయవరంలో 4.2, దేవరాపల్లిలో 5.2, నర్సీపట్నంలో 8.6, చీడికాడలో 5.2, పాయకరావుపేటలో 1.6, గొలుగొండలో 5.2, కోటవురట్లలో 7.2, మాడుగులలో 4.8, నాతవరంలో 2.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షాలు తగ్గే వరకు పునరావాస శిబిరాలు

... 5వ పేజీ తరువాయి

పరిస్థితుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ కాలువలు సరిగతా లేకపోవడం, ఉన్న కాలువలు ఆక్రమణకు గురవ్వడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతున్నదని పంచాయతీ వార్డు సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. దీంతో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కొత్త కాలువల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. తరచూ ముంపునకు గురవుతున్న ప్రాంతాల్లోని వారికి పక్కా ఇళ్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో ఆంజనేయులు, తహశీల్దార్ రవికుమార్, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ నూకరత్నం, ఈవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, నకురు కోటేశ్వరరావు, తదితరులు వున్నారు.

అప్రమత్తతతో తుఫాన్ నష్టం తగ్గింది

» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తుఫాన్ తీవ్రతను అంచనా వేసి ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడం వల్ల తక్కువ నష్టంతో బయటపడ్డామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించి భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టాన్ని నివారించారని అన్నారు. రహదారులకు అడ్డంగా పడిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారని తెలిపారు. ఇళ్లు కూలిన/ పాక్షికంగా దెబ్బతిన్నా.. తహశీల్దార్ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని, ఇళ్ల మరమ్మతులు కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని అన్నారు.

జలాశయాలకు వరద పోటు

... 5వ పేజీ తరువాయి

గంటలకు 1,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 135.1 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో అధికారులు ఒక తెరిచి 750 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. తరువాత ఇన్‌ఫ్లో 1,450 క్యూసెక్కులకు పెరగడంతో మరో గేటు తెరిచి 1,000 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో 1,570 క్యూసెక్కులకు చేరడంతో అంతే మొత్తంలో పెద్దేరు నదిలోకి విడిచిపెడుతున్నారు.


పెద్దేరు జలాశయం స్పిల్‌వే నుంచి నీటిని విడదుల చేస్తున్న దృశ్యం

కల్యాణపులోవ మూడు గేట్లు ఎత్తివేత

రావికమతం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా బుధవారం 280 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. దీంతో మూడు గేట్లు ఎత్తి 250 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నారు.

తాండవ నుంచి 1,200 క్యూసెక్కులు..

నాతవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాండవ జలాశయంలోకి 1,200 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. స్పిల్‌వే గేట్లు ఎత్తి 1,200 క్యూసెక్కుల నీటిని తాండవ నదిలోకి విడుదల చేస్తున్నారు. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా బుధవారం సాయంత్రం 377.8 అడుగులుగా నమోదైంది.

రావణాపల్లి నుంచి 1000 క్యూసెక్కులు..

నర్సీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రావణాపల్లి రిజర్వాయర్ పొంగి పొర్లుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 358.5 అడుగులు కాగా బుధవారం 1,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. జలాశయం ఇప్పటికే నిండడంతో వచ్చిన నీరు వచ్చినట్టు ఆనకట్ట మీదుగా దిగువకు పారుతున్నది.

కోనాం నుంచి 700 క్యూసెక్కులు..

చీడికాడ, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోనాం జలాశయానికి భారీగా వరద నీరుచేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా 800 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. అధికారులు గేట్లు ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574